నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY




సంపుటి : 13 సంచిక : 70 రంగారెడ్డి మంగళవారం 07 జులై 2026 ఎడిటర్ : బవనారి రవికుమార్ 07-07-2026 Tuesday పేజీలు : 8 వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy- Siddipet-Medchal-Jagityal-Vemulawada

## యాదాద్రి తరహాలో మరో టెంపుల్..

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



**నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:**

తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తారామతి బారామతిని టూరిజం ప్లేస్‌గా మరింతగా అభివృద్ధి చేయాలని, దుర్గం చెరువును పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని అధికారులను సీఎం ఆదేశించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునీకరి ంచాలన్నారు. టూరిజం హబ్ డెవలప్మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలన్నారు. వికారాబాద్‌లో వీరభద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయుయడంతో ఈ ఆలయానికి యాదగిరిగుట్ట తరహాలో కమిటీ ఏర్పాటు

(మిగతా 3లో..)

## తెలంగాణ అసెంబ్లీలో నూతన శకం

**నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:**



తెలంగాణ అసెంబ్లీలో నూతన శకం ప్రారంభమైంది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇటు తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి కూడా అసెంబ్లీలో మీడియా అడ్వైజరీ కమిటీకి ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. కానీ సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాలతో అసెంబ్లీ.. మండలి కార్యదర్శులు మీడియా అడ్వైజరీ కమిటి కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు పనులు దగ్గరుండి పర్యవేక్షించారు. అసెంబ్లీ అడ్వైజరీ కమిటీ కోసం ప్రత్యేకంగా దేశంలో ఏ అసెంబ్లీలో ప్రత్యేక కార్యాలయం లేదు. పార్లమెంట్‌లో కూడా ఇలాంటి వసతి ఏర్పాటు జరగలేదు. కానీ మొదటి సారి తెలంగాణ అసెంబ్లీలో మీడియా అడ్వైజరీ కమిటీ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు జరిగింది.మీడియా అడ్వైజరీ కమిటీ కార్యాలయం సోమవారం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.. మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. ఎంపీ వేం నరేందర్ రెడ్డిలు ప్రారంభించారు. కమిటి చైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కో చైర్మన్ పరిపూర్ణ చారి కమిటి సభ్యులు.. ఉదయం పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

## ఆరో రోజుకు చేరిన 'రైతు భరోసా'..

### 7 ఎకరాల రైతులకు నిధులు విడుదల

**నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:**

వానాకాలం పంట సీజన్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'రైతు భరోసా' పెట్టుబడి సాయం పంపిణీ ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. ఆరో రోజులో భాగంగా సోమవారం రాష్ట్రంలోని 7 ఎకరాల లోపు సాగు భూమి ఉన్న లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులను సర్కార్ విడుదల చేసింది. 92,729 మంది అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లోకి రూ.354.96 కోట్లను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో నేరుగా జమ చేసినట్లుగా వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. మార్కెట్‌లో విత్తనాలు, ఎరువుల కొనుగోళు జోరందుకున్న సమయంలో ప్రభుత్వ పెట్టుబడి సాయం అందడంపై అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వరకు పెట్టుబడి సాయం కింద రాష్ట్రవ్యాప్తంగా 68.37 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి 124.85 ఎకరాలకు గాను రూ.7,490.72 కోట్లు జమైనట్లుగా అధికారులు వెల్లడించారు.



## బీఆర్ఎస్ కట్టిందని కన్నేపల్లి నుంచి నీటిని ఆపొద్దు..

### కాళేశ్వరంపై ఈటల సంచలన వ్యాఖ్యలు



(మిగతా 3లో..)

## 'స్టేట్ ఇన్నోవేషన్ రిజిస్ట్రీ' సర్వేతో పేదలకు ముప్పు

### ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

**నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:**



తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని భావిస్తున్న 'స్టేట్ ఇన్నోవేషన్ రిజిస్ట్రీ', సామాజిక సర్వేపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సరైన ధృవీకరణ పత్రాలు లేకపోవడం వల్ల రాష్ట్రంలోని లక్షలాది మంది పేదలు

(మిగతా 3లో..)

## చిన్నారులతో కలిసి 'చిర్ర గోనె' ఆడిన హరీశ్ రావు

**నిర్భయవార్త ప్రతినిధి : సిద్ధిపేట:**



తరాజకీయాల్లో ఎప్పుడూ బిజీగా ఉంటూ, ప్రజల్లో ఉండేందుకు ఇష్టపడే బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే హరీశ్ రావు మరోసారి తన వినూత్న శైలితో అందరి దృష్టిని ఆకర్షించారు. ఆయనకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. తన సొంత నియోజకవర్గమైన సిద్ధిపేట పర్యటనలో భాగంగా హరీశ్ రావు సోమవారం స్థానికంగా పర్యటించారు. ఈ క్రమంలో వీధిలో కొందరు చిన్నారులు మన సంప్రదాయ గ్రామీణ ఆట 'చిర్రగోనె' (బిళ్లంకోడు / గిల్లిదండా) ఆడుతూ కనిపించారు. వారిని చూడగానే హరీశ్ రావు తన బాల్య జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయారు. ప్రోటోకాల్స్, రాజకీయాలను పక్కనబెట్టి నేరుగా ఆ పిల్లల వద్దకు వెళ్లి, కర్ర పట్టుకుని వారితో కలిసి చిర్రగోనె ఆడ్డారు. ఒక పక్కా లోకల్ ప్లేయర్ ఆయన చిర్రను గాల్లోకి లేపి కొట్టిన తీరు అక్కడున్న వారిని ఎంతగానో ఆకట్టుకుంది. నియోజకవర్గ ప్రజాప్రతినిధి తమతో కలిసి అంత సరదాగా ఆడటంతో చిన్నారుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

**సోషల్ మీడియాలో ఆసక్తికర పోస్ట్..**

ఆట ముగిసిన తర్వాత ఈ జ్ఞాపకాలకు సంబంధించిన విజువల్స్‌ను హరీశ్ రావు తన అధికారిక సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఒక చక్కని సందేశాన్ని ఇస్తూ.. "గ్రామీణ ప్రాంతాల్లో అంతరించిపోతున్న ఆటలను నేటి తరానికి పరిచయం చేసి, వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉంది. ఇంతకీ ఈ ఆట పేరు ఏంటో చెప్పగలరు.?" అంటూ నెటిజన్లను అడిగారు. దీనిపై నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. "మా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తొచ్చాయి సార్", "చిర్రగోనె, బిళ్లంకోడు, గిల్లిదండా" అంటూ కామెంట్లు పెట్టారు.

## జులై 14న కళాశాలల బంద్.. పిలుపునిచ్చిన ABVP

**నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:**




విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా జూలై 14వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలల నుండి యూనివర్సిటీ స్థాయి వరకు అన్ని రకాల విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

**రూ. 11,000 కోట్ల బకాయిలు.. విద్యార్థుల వలసలు:**


రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన దాదాపు 20 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుకుంటున్నారని రాంబాబు తెలిపారు. (మిగతా 3 లో..)

## వాట్సాప్ 'యూజర్‌నేమ్' ఫీచర్‌కు కేంద్రం బ్రేక్..

### భారత్‌లో ప్రస్తుతానికి నో ఎంట్రీ!

**ఢిల్లీ:నిర్భయవార్త**

ప్రముఖ మెసేజింగ్ ప్లాట్ ఫారమ్ వాట్సాప్ తీసుకురావాలనుకున్న యూజర్ నేమ్ ఫీచర్ పై కేంద్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వివాదాస్పద ఫీచర్ పై స్పందించేందుకు వాట్సప్ మాతృసంస్థ మెటాకు కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ మరో మూడురోజులు అదనపు గడువు ఇచ్చింది. అయితే.. ఈ ఫీచర్ పై ప్రభుత్వంతో చర్చలు పూర్తిగా ముగిసేంతవరకూ భారత్ లోకి అందుబాటులోకి తీసుకురాబోమని మెటా ప్రతినిధులు స్పష్టం చేశారు.




**యూజర్ నేమ్ ఫీచర్ పై ఎందుకంత ఆందోళన?**

ప్రస్తుతం వాట్సాప్ లో ఒకరితో ఒకరు చాట్ చేయాలంటే ఫోన్ నంబర్ తప్పనిసరి. అయితే వాట్సప్.. ఈ ఫోన్ నంబర్ అవసరం లేకుండా యూజర్ నేమ్ ద్వారా చాట్ చేసేలా కొత్త ఫీచర్ ను డిజైన్ చేసింది. దీనివల్ల ఆన్లైన్ మోసాలు, ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్ స్కాములు, ఒకరిపేరుతో మరొకరు చలామణి అయ్యే ముప్పు విపరీతంగా పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. నిబంధనలు ఉల్లంఘిస్తే ఐటీ చట్టం కింద ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని కేంద్రం మెటాకు నోటీసులు జారీ చేసింది.దీనిపై వాట్సప్ వివరణ ఇస్తూ.. ఈ ఫీచర్ ను ఇంకా లైవ్ చేయలేదంది. (మిగతా 3 లో..)

నిర్భయవార్త
సంపాదకీయం
మంగళవారం 07 జులై 2026

# గుడిలో దొంగలు పడ్డారు!

గుళ్లల్లోని రాళ్లన్నీ దేవుళ్లే అయితే, నేడు దేశంలో ఇంత అవినీతి, ఇంత నైతిక పతనం, ఇంత అధోగతి వుండదు" అని సి.వి. తన "ఊళ్లోకి స్వాములవారు వేంచేశారు" పుస్తకంలో అంటారు. భక్తి పేరుతో ఏర్పడిన కొన్ని సంస్థలు, ట్రస్టులు, గుడులు మోసానికి మూలస్తంభంగా మారుతున్నాయి. ఇంతకాలం మతాన్ని, గుడులను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారు. ఇప్పుడు ఆర్థిక ప్రయోజనాల కోసం భక్తుల విశ్వాసాన్ని, దేవుడ్ని, దేవుడి ఆస్తులను కొల్లగొట్టడం కంటే అధోగతి ఇంకేముంటుంది? దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ఎందరో భక్తులు ఎంతో భక్తిభావంతో రామాలయ నిర్మాణానికి విరాళాలు అందించారు. అయితే ఇప్పుడు విరాళాల గోల్ మాల్ వార్తలు... ప్రపంచవ్యాప్తంగా విరాళాలిచ్చిన వారి మనోభావాలను, వారి విశ్వాసాలను గాయపరిచాయి. రామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల దుర్వినియోగం కేసులో పోలీసులు ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసి పలువురిని అరెస్టు చేసిన నేపథ్యంలో, ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బద్రీనాథ్ ఆలయంలోనూ భక్తుల కానుకల నగదు దుర్వినియోగమైందన్న అంశం వెలుగులోకి రావడం మరింత చర్చనీయాంశంగా మారింది. బద్రీనాథ్--కేదార్‌నాథ్ దేవస్థాన కమిటీ (బికెటిసి )కి చెందిన ఓ ఉద్యోగి ఆలయ విరాళాల నగదును అపహరించాడని భైరవ్ సేన అనే సంస్థ ఆరోపించింది. ఆ ఉద్యోగి కమిటీ ఛైర్మన్‌కు వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్నారని ఆ సంస్థ పేర్కొనడం కలకలం రేపింది. శతాబ్దాలుగా పాలక వర్గాలు మతాన్ని... ప్రజల చైతన్యాన్ని నియంత్రించే సాధనంగా ఉపయోగించుకున్నాయి. ఎన్నికల సమయంలో దేవుడు ఓట్లుగా మారాడు. ఇప్పుడు అదే దేవుడు కోట్ల రూపాయల విరాళాలుగా మారుతున్నాడు. భక్తి ఒక భావోద్వేగం అయితే, దానిని మార్కెట్‌గా మార్చిన వ్యవస్థే అసలు సమస్య. ప్రజల విశ్వాసమే పెట్టుబడిగా, దేవుడే బ్రాండ్‌గా, గుడులే ఆదాయ కేంద్రాలుగా మారినప్పుడు ధర్మం క్రమంగా వ్యాపారానికి బానిస అవుతుంది. అందుకే అంటాడు వేమన– "ఆత్మశుద్ధి లేని ఆచారమది యేల?/ భాండశుద్ధి లేని పాకమేల?" అని. శ్రీరాముని హారం, పాదుకలు, ఆభరణాలు చోరీకి గురయ్యాయి. భక్తులు సమర్పించిన వజ్రాలు, ఆభరణాలు మాయమయ్యాయి. వెండి ఇటుకలు, వెండి దీపాలు, నగదు విరాళాలు కూడా దొంగతనానినికి గురయ్యాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో "రామ మందిర విరాళాల దొంగతనం ఇప్పుడు మొదలైంది కాదు.. 2021లోనే దోపిడీ ప్రారంభమైంది. అక్కడ భారీ భూ కుంభకోణం జరిగింది. రూ. 2 కోట్ల విలువైన భూమిని ఆలయ ట్రస్ట్‌కు కేవలం 10 నిమిషాల వ్యవధిలోనే రూ. 18 కోట్లకు విక్రయించారు. అదేవిధంగా రూ. 3 కోట్ల విలువైన భూమిని రూ. 24 కోట్లకు, రూ. 9 కోట్ల విలువైన భూమిని రూ. 55 కోట్లకు, అలాగే రూ. 14 కోట్ల విలువైన భూమిని రూ. 95 కోట్లకు కొనుగోలు చేశారు. ఈ లావాదేవీలకు సంబంధించిన పత్రాలు బహిరంగంగా అందుబాటులో ఉన్నాయి' అని అరవింద్ కేజ్రీవాల్ వంటివారు ఆరోపించడం మరింత సంచలనంగా మారింది. రోజుకు సుమారు 70వేల మంది భక్తులు వచ్చే తిరుమలకు రూ. 3 నుంచి రూ. 5 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. అలాంటిది రామమందిరం ఆదాయం ఏ స్థాయిలో వుండాలి? అన్న ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి. ?దేశంలోని ఆలయాలన్నింటినీ ప్రభుత్వ పెత్తనం నుంచి తొలగించి... అయోధ్య తరహాలో హిందూ సమాజానికి అప్పగించాలని, ఆర్ఎస్ఎస్ అనుయాయ సంఘాలు దేశమంతటా హిందూ శంఖారావ సభలు పెట్టి యాగీ చేయడం వెనుక ఇలాంటి క్రుటలున్నాయా? అని ప్రజలు అందోళన వ్యక్తం చేస్తున్నారు. దేవుడి హుండీలో పడేది నోటు కాదు---ఒక పేదవాడి ఆశ. ఒక రైతు చెమట చుక్క. ఒక కూలీ కన్నీరు. ఒక తల్లి ప్రార్థన. ఒక వృద్ధుడి నమ్మకం. అలాంటి విశ్వాసాన్ని అపహరించడం అంటే కేవలం డబ్బు దొంగతనం కాదు; సమాజం నైతిక పునాదులపై దాడి చేయడమే. ఇది వ్యక్తుల వైఫల్యం మాత్రమే కాదు; జవాబుదారీతనం లేని వ్యవస్థ వైఫల్యం. కోట్లాది రూపాయల విరాళాలు వస్తున్న ఆలయాలకు ప్రజల ముందు లెక్క చెప్పాల్సిందే. ప్రతి రూపాయి ఆదాయం, ప్రతి రూపాయి ఖర్చు ప్రజలకు వెల్లడించాల్సిందే. స్వతంత్ర ఆడిట్లు, సామాజిక పర్యవేక్షణ, పారదర్శక లెక్కలు, కఠిన శిక్షలు లేకుండా పవిత్రత గురించి చేసే ప్రసంగాలు ఖాళీ నినాదాలుగానే మిగిలిపోతాయి. మతం వ్యక్తిగత విశ్వాసం కావచ్చు. కానీ ఆలయాల ఆస్తులు ప్రజల విశ్వాసంతో కూడిన సామాజిక సంపద. గుడుల్లో పడిన దొంగలను కాపాడటం అంటే, నేరగాళ్లకు ఆశ్రయం కల్పించడమే. సమాజానికి ఇప్పుడు అవసరమైంది మరింత పారదర్శకత... మరింత జవాబుదారీతనం. ప్రజల నమ్మకాన్ని దోచుకుని, తమ విరాళాల నుండి కోట్లాది రూపాయలను దోచుకునేవారు హిందూ మతం యొక్క కాపలాదారులు ఎలా అవుతారు? అని భక్తులు ప్రశ్నిస్తున్నారు

# కాలం సవాలు..కలిసే గళాలు!

నువు కులుకుతు తిరిగెద వెవరబ్బ సొమ్మని రామచంద్రా' అని తన ఆరాధ్య దైవమైన శ్రీరాముడిని ప్రశ్నించాడు రామదాసు అనే కంచర్ల గోపన్న, ఒకనాడు. 'నా పేరిట గుడి కట్టి కొట్టుకు తిందురా' అని సాక్షాత్తూ శ్రీరామచంద్రమూర్తి ఘోషించవలసిన పరిస్థితి ఇప్పుడు అయోధ్యలో. 'వందేమాతరం' అనే గీత చరణంతో భారతీయులు స్వాతంత్ర్య పోరాటం జరిపితే దానిలోని రెండు చరణాలు జాతీయ గీతంలా నిర్ణయించారు రాజ్యాంగ పెద్దలు. ఇప్పుడు ఆ రెండు చరణాలు కాదు మరిన్ని తెచ్చిపెట్టి కొత్త వివాదాలకు కారణమవుతున్నది కేంద్రం. 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అంటూ 'వెనక పడితే వెనకేనోయ్' అని హెచ్చరించారు గురజాడ. కాగా 'పదండి ముందుకు' అన్న శ్రీశ్రీకి ప్యారడీలాగా పదండి వెనక్కు అన్నవారికే గురజాడ అవార్డు కట్టబెట్టారు వరుసగా రెండుమూడు సార్లు. 'చేతిలో దీపం లేదు. చుట్టూ చీకటి' అంటూ శేషేంద్ర శర్మ కవితతో




రాజకీయ యాత్ర ప్రారంభించిన నాయకుడు సనాతనమే దీపమంటూ ఆయన కోరుకున్న సామ్యవాద భావధార విదేశీయమని తోసిపారేస్తున్నారు ఇప్పుడా నాయకుడు. 'ప్రశ్నిస్తూనే వుంటాం' అని ప్రకంపనల స్థాయిలో ప్రకటించిన వారు ఇప్పుడు ప్రశ్న మహాపరాధమైనట్టు వేటాడుతున్నారు. మీడియా అరచేతిలోకి వచ్చేసిందని ఆర్భాటాలు చేసిన డోనాల్డ్ ట్రంప్ నుంచి నరేంద్ర మోడీ సర్కారు వరకూ సోషల్ మీడియా హద్దు మీరవద్దని హూంకరిస్తున్నారు. అక్షరాలకూ భావాలకూ గల శక్తి ఏమిటో, వాటిపై తిరోగాములకు ఎంత భయమో చెప్పే ఉదాహరణలే ఇవన్నీ.

**నిరసన గళాలు..నిషేధాలు...**

అప్పటి సాహిత్య వారసత్వంపైన ఇంత ఉలికిపాటు వ్యూహాలు వుంటే ఇప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. 'రచయిత మరణించాడు' అని పెరుమాళ్ మురుగన్ వంటి అవార్డు గ్రహీత ప్రకటించాల్సి రావడం ఈ దుర్భర పరిస్థితికి ఒక నిదర్శనం. 'ఘర్ వాపసీ' అంటూ ఒకవైపున మతపరమైన దాడులు పెరుగుతుంటే రచయితలు 'అవార్డు వాపసీ' అంటూ తమకు వచ్చిన అవార్డులను తిరస్కరించడం పెద్ద సంచలనమే అయింది. ద్రవ్య పెట్టుబడి విజృంభణతో కార్పొరేట్ ప్రైవేటీకరణ నమూనాలో ప్రతీదీ మార్కెటైజేషన్, మానిటైజేషన్ అంటూ లెక్కలు కడుతున్న వేళ ప్రజావరణాన్ని కుదించే ప్రయత్నాలు తీవ్రంగా జరుగుతున్నాయి. కృత్రిమ మేధ అనే ఎ.ఐ వచ్చాక సృజన, రచన వంటి వాటికి గతంలో వున్న ప్రాధాన్యత లేదని చెప్పడం పరిపాటి అయ్యింది. కేంద్రం అనుసరిస్తున్న ఏకపక్ష భాషా విద్యా విధానాల వల్ల మాతృభాష అయిన తెలుగు వికాసానికి కూడా అవరోధాలు ఎదురవుతున్నాయి. ఇన్ని భాషా సాంస్కృతిక, సామాజిక, రాజకీయ సవాళ్ల మధ్యనా ప్రజా శ్రేయస్సు, ప్రజాస్వామ్య వికాసం, ప్రజా సంస్కృతీ వికాసం కోరే కవులు, రచయితలు, విమర్శకులు, సాహిత్యాభిమానుల కృషి మరెన్నో రెట్లు పెరగాల్సిన ఆవశ్యకత పెరుగుతున్నది. ఇరాన్‌పై అమెరికా దాడి నుంచి ఇంధన పర్యావరణంపై వేటు దాకా...సార్వత్రిక ఓటు హక్కు నుంచి భావ ప్రకటనా స్వేచ్ఛ దాకా దాడికి గురవుతున్న పరిస్థితుల్లో ప్రజాపక్ష రచయితల కలాలు, గళాలు పదునెక్కాల్సిన అవసరం స్పష్టమవుతున్నది. మహిళలూ దళిత, గిరిజన వర్గాలు, అల్ప సంఖ్యాకులు ఈ అప్రజాస్వామిక ధోరణులకు ప్రధానంగా బలవుతున్నారు.

**సమ్మేళనం**

సవాళ్లు తీవ్రమైనప్పుడు సంఘర్షణా తీవ్రం కాకతప్పదు. కాలం లాగే సామాజిక, సాంస్కృతిక పోరాటం ముందుకే పోతుంది గాని వెనక్కు నడవదు. అవరోధాలనూ అభివృద్ధి నిరోధక ధోరణులను, అవకాశవాదాలను ఛేదిస్తూ ముందుకు సాగుతుంది. విశాల ప్రజాస్వామిక స్పృహ, ప్రజా జీవిత వైవిధ్య వాస్తవిక పార్శ్వాలు స్పృశిస్తూ కార్యోన్ముఖం చేసే ఏ రచనైనా మంచిదే. సామాజిక న్యాయం, సమానతా కోణం, మానవీయ పార్శ్వాలు, పోరాటశీలత, వైజ్ఞానిక స్పృహ పెంచేదేదైనా మంచిదే. గతంలోని గొప్ప వారసత్వాన్ని స్వీకరిస్తూ వర్తమాన కర్తవ్యాలను సూచిస్తూ భవిష్యత్ దిశా నిర్దేశం చేసేదై వుండాలి. కొత్త తరాలను, స్వరాలను మరీ ముఖ్యంగా పీడిత బాధిత జన కోటి గొంతులను వినడం, వినిపించడం నేర్చుకోవాలి. భావంలోనే గాక రూపంలోనూ వైవిధ్యాన్ని తీసుకు వస్తే పాఠకులూ వీక్షకులూ కావ్యకర్తలూ పెరుగుతారు. పుస్తక ప్రదర్శనలు, చిత్రాల ప్రదర్శనలు, కవితా పఠనం సాహిత్య చర్చ, విద్యాలయాల్లో సాహిత్య సభలు వంటివన్నీ ఈ దిశలో జరిగే ప్రయత్నాలే. పాటను కూడా కలుపుకోవాలి. సోషల్ మీడియా వల్ల వచ్చిన అవకాశాలకు కూడా సాహిత్య వేదికవడం చూస్తున్నాం. ఎ.ఐ కు కూడా ప్రాథమికంగా ప్రాంప్ట్ ఇవ్వవలసింది మనుషులే. సరైన దిశలో సాధ్యమైనవన్నీ విస్తార ప్రజానీకంలోకి తీసుకువెళ్లే వేదికలుగా మలుచుకోవాలి. పరిమితులు ఛేదించుకుంటూ ప్రతిబంధకాలపై పోరాడాలి. సంకుచిత ధోరణులను, వ్యర్థ వివాదాలను తోసిపుచ్చుతూ రచయితల ప్రతిభకు పదును పెంచుకుంటూ దృష్టి కోణాన్ని వేదికలనూ కూడా విశాల పర్చుకోవాలి. జులై 11,12 తేదీలలో విజయవాడలో సాహితీ స్రవంతి, మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న 'సాహిత్య సమ్మేళనం 2026' ఆ దిశలో ఒక పెద్ద ప్రయత్నం. దీనిపై ఇప్పటికీ సాహితీ మిత్రులలో విస్తృతమైన చర్చ ప్రారంభం కావడం హర్షణీయం. వివిధ జిల్లాల నుంచి విద్యాలయాల నుంచి ఈ సమ్మేళనానికి వస్తామని చెప్పడం సాహిత్యం పట్ల ఆసక్తికి అద్దం పడుతుంది. విశాల ప్రాతిపదికన కలసి అక్షరాలే ఆయుధాలుగా ముందుకు సాగమంటున్నది.

గతంలో ఉమ్మడి రాష్ట్రంలో విజయవాడలోనే విజయవంతంగా జరిగిన సాహిత్యశాల ఈ వరవడికి నాంది పలికింది. తర్వాత కాలంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంతో కలసి హైదరాబాదులో, కర్నూలులో వరుసగా జరిగిన మూడు సాహిత్య శాలలు, కార్యశాలలు, కథా కవితా శాలలు, జన కవనాలు సాహితీ మిత్రులను విశేషంగా ఆకర్షించాయి. ఇప్పుడు కార్పొరేట్ మతతత్వ దాడి తాకిడి, అంతర్జాతీయంగా ఆధిపత్య శక్తుల దాడి తీవ్రమైన పరిస్థితిలో ఇది మరింత ప్రత్యేకత సంతరించుకుంటున్నది. పాలకుల అసహనం, అప్రజాస్వామిక శాసనాలు, విమర్శను సహించలేని లక్షణం భావ ప్రకటనా స్వేచ్ఛకు ఆటంకాలుగా మారడమే గాక రచయితలు, వ్యాఖ్యాతలు, మీడియా గొంతులను నొక్కేసే ప్రయత్నాలు నిత్యకృత్యమైనాయి. మీడియా, సోషల్ మీడియా, పుస్తకాలు, సినిమాలలో ఎక్కడ ఏ కాస్త విమర్శ, ఆక్షేపణ వినిపించినా ఉలిక్కిపడుతున్నారు. మరో వంక కీలక స్థానాల్లో వున్న నాయకులే బూతులు తిట్టుకుంటూ ఒకరినొకరు దూషించుకుంటూ వాతావరణం కలుషితం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సహనం, సంయమనం, సదవగాహన, సాంస్కృతిక విలువలు నేర్పేందుకు సాహిత్యం వేదిక కాగలదు. అందులోనూ లాభాల దాహం లేని ప్రజా సాహిత్యం ఈ జాడ్యాలకూ కొరడాలకు విరుగుడుగా పని చేయగలదు. సాహిత్యం ఎప్పుడూ సమాజపు సొత్తు తప్ప ప్రైవేటు ఆస్తి కాదు. ఇప్పటి వరకూ తెలుగు సాహిత్యంలో వాణిజ్య పోకడలు వున్నా ప్రజాస్వామ్య లౌకిక విలువలదే పెద్ద పీటగా వుంది. ఇప్పుడిప్పుడే యువతను సనాతనవాద ప్రచారంతో రెచ్చగొట్టేందుకు ప్రభుత్వ వనరులు గుమ్మరించి ప్రలోభపెట్టేందుకు ప్రయత్నాలు మొదలైనాయి. ఆ విధమైన రచయితలనూ రచనలనూ కావాలని ప్రోత్సహిస్తూ పెద్ద ఆకర్షణలుగా చిత్రించడం కనిపిస్తుంది. ఇది గతంలో లేని బెడద. అప్పట్లో వాణిజ్య నవల వంటివి మాత్రమే వుంటే ఇప్పుడు ఏకంగా ఛాందసం చొరబడుతున్నది. ప్రగతిశీల ఉద్యమాలకు పెట్టింది పేరైన తెలుగునాట ఈ ధోరణిని సుతరామూ ఆదరించదు. కానీ రకరకాల ముసుగులతో వారిని జొప్పించడం విస్మరించరాని విషయం. ప్రవచనాల పేరిట కాలం చెల్లిన మనుధర్మ, మతధర్మ శాస్త్రాలు వల్లె వేయడమే గాక వారిని తెచ్చి యువతకు బోధనలు చేసే సలహాదారులగా నియమించడం ఎలాంటి ఫలితాలకు దారితీస్తుంది? అర్థవంతమైన, చైతన్యస్ఫోరకమైన సాహిత్యంతో కళారూపాలతోనే ఇలాంటి వాటికి సమాధానం సులభ సాధ్యం.

**విస్తృత కృషి దిశగా...**

జీవితపు వడికి, ఒడుదుడుకులకు పతనమే తగ్గుముఖం పట్టిన స్థితిలో సాహిత్యం గురించే చదివేవారు ఎందరుంటారనే సందేహాలు రావడం సహజం. వేమన నుంచి నాజర్, గద్దర్ వరకూ శక్తివంతమైన ఏ గీతానికైనా జన బాహుళ్యం ఉర్రూతలూగడం ఆగలేదు. వీధి నాటికల ప్రేక్షకులూ తగ్గలేదు. ఏ తెలుగు పత్రికా సాహిత్య పరిమళాలు లేకుండా, కవితా చరణాలు ఉపయోగించకుండా వెలువడ్డం లేదు. సభల్లో వక్తృత్వానికి సాహిత్యం అదనపు అర్హత గానే వుంటున్నది. ఆఖరుకు తిట్టుకునే నేతలు కూడా నాలుగు పద్యాలు గేయాలు రాసుకొచ్చి చదువుతున్నారు. డైలాగులు జోడిస్తున్నారు. ఇంటర్నెట్ వెబ్సైట్లలో సాహిత్య సందర్శకుల సంఖ్య గణనీయంగా వుంటున్నది. స్టాండప్ కమెడియన్లను పెనుభూతాలుగా చూస్తున్నారు. ఇవన్నీ సాహిత్య రూపాల శక్తిని చెబుతున్నాయి. ఈ క్రమంలో ఎ.ఐ వంటివి కూడా సాహిత్యకారుల పదును పెంచేవే తప్ప ప్రతికూలమైనవి కాబోవు. పాతవారితో పోలిస్తే కొత్త తరాలకు అవి మరింత దగ్గరగా సులభంగా వుంటాయి కూడా. ఊహించలేని స్థాయిలో ఇప్పుడు స్కూలు పిల్లలు కూడా పుస్తకాలు రాసి ప్రచురిస్తున్నారు, ప్రదర్శిస్తున్నారు. అవి పురోగామి దిశలో వుండాలంటే తరాల మధ్య స్వరాల మధ్య చర్చ జరగాలి. వారికి నా ఆహ్వానం అని మహాకవి అన్నట్టు స్వాగతం పలకాలి. ఈ సాహిత్య సమ్మేళనం అలాంటి విశాలమైన లక్ష్యాలతోనే జరుగుతున్నది. ఇక్కడ ఉపన్యాసాలు పరిమితంగానూ చర్చ, అనుభవాల కలబోత అధికంగానూ వుండే విధంగా రూపకల్పన జరిగింది. ప్రత్యేకంగా కొత్త తరం కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాలుపంచుకోవడం జరుగుతుంది. మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంతో పాటు జిల్లాలలోని వివిధ విజ్ఞాన కేంద్రాలు కూడా ఇందుకోసం కృషి చేస్తున్నాయి. భవిష్యత్తులోనూ తమ బహుముఖ కార్యక్రమాలలో భాగంగా ప్రగతిశీల సాహిత్య సృజనకూ చర్చకూ విజ్ఞాన కేంద్రాలు సహకరించే అవకాశం పెరుగుతుంది (సమ్మేళనం కార్యక్రమ వివరాలు రేపు 'అక్షరం' పేజీలో, సంబంధిత వెబ్‌సైట్లలో చూడవచ్చు). ఇక్కడ చదివిన, వచ్చిన విషయాలు, అంశాలు తర్వాత పుస్తక రూపంలో తీసుకురావడం, 'ప్రస్థానం' ప్రత్యేక సంచికలో ప్రచురించడం జరుగుతుంది. జరిగే చర్చలను, వచ్చిన మిత్రుల సూచనలను బట్టి ఈ తరహా సమ్మేళనాలు, సంకలనాలు ఇక ముందు కూడా వివిధ రూపాలలో అన్ని చోట్లా కొనసాగాలని ఆశిద్దాం.

**తెలకపల్లి రవి**

# విప్లవ జ్యోతి



అల్లూరి ప్రజా పితూరి
అల్లూరి జనులకు దారి
తెల్లవాడిపై ఎత్తిన జెండా
అల్లూరి అగ్ని ప్రచండా
అందుకో మా నివాళి
విప్లవ జ్యోతి అల్లూరి

భారతాన్ని బ్రిటీషోడు ఏలినాడు వందల ఏళ్లు
దొరల పాలన ప్రజలకు బందీఖానా సంకెళ్లు
తూరుపుకనుమలో ఉదయించాడు
తిరుగుబాటు పోరాట నినాదం
స్వరాజ్యం స్థాపనకు ఎగిసిన ఓ నిప్పు కణం
అందుకో మా నివాళి
విప్లవ జ్యోతి అల్లూరి
తల్లి అడవిపై తెల్ల దొరల ఆగడాలను చూసి
ఆదివాసుల జీవితాలు ఛిద్రమైన బ్రతుకులు చూసి చైతన్యం రంగరించి ఆదివాసుల ఒక్కటి చేసి
విల్లు ఎక్కు పెట్టి నాడు మన్య పితూరి నడినాడు
అందుకో మా నివాళి
విప్లవ జ్యోతి అల్లూరి
ఆదివాసుల జీవనం అడవిపై హక్కు
అటవీ ఫలసాయాలు ఆదివాసీల సొత్తు
రామరాజు త్యాగ ఫలం
మరిచి పోదు నేటి తరం
అడవి తల్లి రక్షణకై హక్కుల అమలుకై
అల్లూరి వారసులై సాగిస్తాం పోరాటం
అందుకో మా నివాళి
విప్లవ జ్యోతి అల్లూరి.

**పొద్దు బాలదేవ్**

# యాదాద్రి తరహాలో మరో టెంపుల్..

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని ఆదేశించారు.

**ఎకో పార్కులు.. ఫ్యూచర్ సిటీలో ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్:**

పర్యాటక రంగాన్ని ప్రకృతికి దగ్గరగా తీసుకెళ్లేందుకు వీలుగా క్యూర్ పరిధిలోని అటవీ భూములను, పర్యాటక శాఖతో సమన్వయం చేసుకుంటూ 'ఎకో టూరిజం'గా మార్చాలని సీఎం ఆదేశించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలోనే నగరంలో మరిన్ని ఎకో పార్కులను అందుబాటులోకి తేవాలన్నారు. ప్రతిష్టాత్మక ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని చెప్పారు. ఈ అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టుల పర్యవేక్షణ కోసం ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించి, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**పురానాపూల్ బ్రిడ్జిపై ట్రాఫిక్ మళ్లింపు?**

పాతబస్తీలోని చారిత్రక పురానాపూల్ హెరిటేజ్ బ్రిడ్జిని పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం చెప్పారు. బ్రిడ్జిపై పర్యాటకుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, అవసరమైతే అక్కడ ట్రాఫిక్‌ను మళ్లించి పూర్తి స్థాయిలో పర్యాటక జోన్‌గా మార్చే అవకాశాలను పరిశీలించాలన్నారు. ఈ ఏడాది డిసెంబరులో నిర్వహించ తలపెట్టిన 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్' పై ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మెగా సమ్మిట్ విజయవంతం కావడానికి వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని, ఇందుకోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో సీఎం సలహాదారు రామకృష్ణా రావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

# 'స్టేట్ ఇన్నోవేషన్ రిజిస్ట్రీ' సర్వేతో పేదలకు ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఓ లేఖ రాస్తూ.. ఎస్ఐఆర్ సర్వేను ప్రారంభించే ముందే తెలంగాణలోని పేదలందరికీ శాశ్వత నివాస ధృవీకరణ పత్రాలను ఉచితంగా జారీ చేయాలని డిమాండ్ చేశారు.

**52% మంది దగ్గర బర్త్ సర్టిఫికెట్లు లేవు..**

దేశంలోని పేదల వద్ద ప్రాథమిక పత్రాల కొరతను ఎత్తి చూడడానికి అసదుద్దీన్ ఒవైసీ ప్రముఖ థింక్ ట్యాంక్ 'లోకనీతి-సిఎస్‌డీఎస్', జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే గణాంకాలను ప్రస్తావించారు. "ఢిల్లీతో పాటు ఐదు రాష్ట్రాల్లో లోకనీతి సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం.. దేశంలో ఇప్పటికీ 52 శాతం మంది ప్రజల వద్ద పుట్టిన తేది ధృవీకరణ పత్రం లేదు. అలాగే 41 శాతం మందికి నివాస ధృవీకరణ పత్రాలు, 42 శాతం మందికి కుల ధృవీకరణ పత్రాలు లేవు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రకారం కేవలం సంపన్న వర్గాలలోని 82 శాతం మంది పిల్లలకే బర్త్ సర్టిఫికెట్లు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో కఠినమైన డాక్యుమెంటేషన్‌తో సర్వేలు నిర్వహిస్తే.. నిరక్షరాస్యులు, నిరుపేదలు, గిరిజన, దళిత. మైనారిటీ వర్గాల ప్రజలు రేషన్, ఫించన్లు, ఉచిత విద్యుత్ వంటి పథకాలను కోల్పోతారు" అని ఒవైసీ స్పష్టం చేశారు. అందువల్ల పేదల ప్రయోజనాలను కాపాడటానికి ప్రభుత్వం తక్షణమే పీఆర్‌సీ డ్రైవ్‌ను చేపట్టాలని ఒవైసీ సీఎంకి రాసిన లేఖలో కోరారు.

# వాట్సాప్ 'యూజర్‌నేమ్' ఫీచర్‌కు కేంద్రం బ్రేక్..

(మొదటి పేజీ తరువాయి)

సైబర్ నేరాలను అడ్డుకునేందుకు బలమైన భద్రతా వలయాలను ఏర్పాటు చేస్తున్నామని వాట్సప్ ప్రతినిధి వెల్లడించారు. సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ సంస్థల పేర్లతో నకిలీ ఐడీలు క్రియేట్ చేయకుండా.. ఆయా పేర్లను ముందే హోల్డ్ లో ఉంచినట్లు తెలిపారు. అలాగే ఇందులో లిమిటెడ్ సెర్చ్ ఉంటుందని, ఒకరి యూజర్ నేమ్ పూర్తిగా తెలిస్తేనే మెసేజ్ చేయగలరని, ఊహాజనితంగా పేర్లను టైప్ చేసి వెతికే ప్రయత్నాలను సిస్టమ్ బ్లాక్ చేస్తుందని పేర్కొన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తి యూజర్‌నేమ్ ద్వారా మొదటిసారి మెసేజ్ చేస్తే.. ఆ అకౌంట్ ఎప్పుడు క్రియేట్ అయింది? వారు ఏ దేశానికి చెందినవారు? మనతో ఏవైనా మ్యూచువల్ గ్రూప్స్ ఉన్నాయా? అనే వివరాలను వాట్సాప్ యూజర్‌కు చూపిస్తుందని వివరించారు.

**టెలిగ్రామ్, సిగ్నల్ యాప్‌లకు కూడా నోటీసులు!**

కేవలం వాట్సాప్ మాత్రమే కాదు.. ఇప్పటికే యూజర్‌నేమ్ ఫీచర్‌ను రన్ చేస్తున్న టెలిగ్రామ్, సిగ్నల్ యాప్‌లకు కూడా కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ నోటీసులు పంపింది. ఈ ఫీచర్ల ద్వారా జరుగుతున్న మోసాలను, నకిలీ అకౌంట్లను ఎలా అరికడుతున్నారో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. దీనితో పాటు, పైరసీ కంటెంట్‌ను వ్యాప్తి చేస్తున్నందుకు టెలిగ్రామ్‌కు, ఇన్‌స్టాగ్రామ్ యాడ్స్‌లో చైల్డ్ అబ్యూస్ మెటీరియల్‌పై మెటాకు కేంద్రం శనివారం (జులై 4) తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే.

# అయోధ్య ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్ నియామకం

**ఉత్తరప్రదేశ్:**



అయోధ్య రామ మందిర విరాళాల చోరీ వ్యవహారంలో శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టులో మరో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఆరోపణలు నేపథ్యంలో రాజీనామా చేసిన చంపత్ రాయ్ స్థానంలో ట్రస్ట్ తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్ బాధ్యతలు చేపట్టారు. సోమవారం జరిగిన అత్యున్నత స్థాయి అత్యవసర సమావేశంలో ట్రస్ట్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఇక్కడ ఆస్తికర విషయమేంటంటే.. అయోధ్య ఆలయ విరాళాల నిధుల్లో అక్రమాలు జరుగుతున్నాయని, హుండీ ఆదాయానికి గండి పడుతోందని మొదటిగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది కృష్ణమోహనే. ఆయన ఇచ్చిన అధికారిక ఫిర్యాదు ఆధారంగానే అయోధ్య పోలీసులు, సిట్ అధికారులు రంగంలోకి దిగి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాయి. విరాళాల దొంగతనాన్ని బయటపెట్టడంలో కీలక పాత్ర పోషించిన ఆయనకే ఇప్పుడు ట్రస్ట్ తాత్కాలికంగా అత్యున్నత పరిపాలనా బాధ్యతలను అప్పగించడం విశేషం. పూర్తి స్థాయి దర్యాప్తు ముగిసి, కొత్త శాశ్వత కార్యదర్శిని ఎన్నుకునే వరకు కృష్ణమోహన్ ఈ పదవిలో కొనసాగనున్నారు.

# బీఆర్ఎస్ కట్టిందని కన్నేపల్లి నుంచి నీటిని ఆపొద్దు..

**నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:**

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఉన్న కన్నెపల్లి పంప్ హౌస్ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం నడుస్తున్న వేళ ఈ పంప్ హౌస్ వినియోగంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. కన్నెపల్లి నుంచి నీటిని తీసుకురావచ్చని ఇలాంటి సమయంలో భేషజాలకు పోవద్దని ఇప్పుడు కావాల్సింది విమర్శలు, ప్రతివిమర్శలు కాదని నీళ్ళు కావాలన్నారు. గత ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టు కాబట్టి దానిని ఆపరేట్ చేయొద్దనుకోవడం సరికాదన్నారు. కాళేశ్వరంపై విచారణ జరిపించండి. దోషులను శిక్షించండి కానీ ప్రజలను కాదని రైతులను శిక్షించే అధికారం రేవంత్ రెడ్డికి లేదన్నారు. సోమవారం నాంపల్లిలోని బీజేపీ స్టేట్ కార్యాలయంలో శ్యామాప్రసాద ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించిన ఈటల ఈ సందర్భంగా మాట్లాడారు.

**మూర్ఖంగా వ్యవహరించవద్దు:**

కాళేశ్వరంపై కమిటీలు, కమీషన్ల రూపంలో చర్చోపచర్చలు జరిగాయి అవి పక్కన పెడితే కన్నెపల్లిపై ఉన్న అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి డ్యాములు, పంప్ హౌస్లు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయన్నారు. కన్నేపల్లి పంప్ హౌస్?లో 50 వేల క్యూసెక్కుల నీళ్లు వచ్చిన పంప్ హౌస్ లోపలికి నీళ్లు వస్తాయి. వాటిని పంప్ చేయవచ్చన్నారు. ఇప్పుడు లక్ష క్యూసెక్కుల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయని వార్తలు వస్తున్నాయి.. మరోపక్క కరువు రాబోతుంది అనే వార్తలు కూడా వస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఎవరిది తప్పు.. ఎవరు దుర్మార్గులు.. అని చర్చ పెట్టకుండా.. కోట్ల రూపాయలతో కట్టబడ్డ ప్రాజెక్టులను ఉపయోగించుకోవాలన్నారు. వర్షాలు లేక రైతు విత్తనాలు కూడా వేసుకోలేని పరిస్థితి ఉందని హైదరాబాదు లాంటి నగరాలు తాగే నీటి కోసం కృష్ణా గోదావరి మీదనే ఆధారపడి ఉన్నాయి. కాబట్టి నీళ్లను పంప్ చేయాలని డిమాండ్ చచేశారు. ప్రాజెక్టు కుంగిపోయింది, నీళ్లు నిలవనిది వాస్తవం. కానీ కన్నేపల్లి కెపాసిటీ 2ంవీజ లు అంటే ఇరవై ఐదు వేల క్యూసెక్కుల నీళ్లు వస్తె పని చేస్తాయి కాబట్టి వెంటనే పంపింగ్ మొదలు పెట్టాలన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అనేక పథకాలు అన్ని ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి విశాల దృక్పథంతో ఆలోచన చేయాలన్నారు.

**ఎప్పుడు ఎన్నికలొచ్చినా రేవంత్‌కు ఓటమే:**

ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ఎప్పుడు ఎన్నికలొచ్చినా రేవంత్ ఓడిపోతాడని ప్రజలంటున్నారన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో హైడ్రాకు మూల్యం చెల్లించుకోబోతున్నారు. రేవంత్ రెడ్డికి చాలా క్లారిటీ ఉందని ఆయన అమెరికా గడ్డమీద నిలబడి అబద్దాలు చెప్తేనే ప్రజలు ఇష్టపడతారు.. అబద్ధాలు చెప్పే నాయకులనే ప్రజలు బలపరుస్తారు అని చెప్పారు. దానికి పరాకాష్ట.. హైడ్రా అనే పదం నేను హిట్లర్ నుంచి తీసుకున్నాను అని ఆయన చెప్పడమే అన్నారు. దీన్ని బట్టే ఆయన నైజం అర్థం చేసుకోవాచ్చన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వాలు పేదవాళ్లకు ఇంటి జాగాలను ఇళ్లను ఇచ్చారు. కానీ రేవంత్ రెడ్డి విధానం వేరు. పేదవాళ్ల ఇళ్లను కూలగొట్టడం, ఆనాటి ప్రభుత్వాలు ఇచ్చిన జాగాలు గుంజుకొని పెద్దవాళ్లకు అంటగట్టడమే ఆయన ఎజెండా అన్నారు. హిట్లర్ కు వారసత్వం అని చెప్పుకుంటున్న హైడ్రా ప్రజలకు న్యాయం చేస్తుందనుకోవడం మన తప్పు అన్నారు. నేను హైడ్రాను వ్యతిరేకించిన మొదట్లో చాలామంది ఈటల రాజేందర్ ఏంటి ఈ విధంగా చేస్తున్నారని ప్రశ్నించారు.. కానీ ఒంటరిగా నాలుగు నెలల పాటు కొట్లాడిన తర్వాత.. హైడ్రా నిజస్వరూపం అందరికీ తెలిసింది. ఇప్పుడు కోర్టు కూడా అదే చెప్పిందన్నారు. రంగనాథ్ నాకు ఏ చట్టంతో, కోర్టులతో సంబంధం లేదు. నన్ను ఎవరు నిలువరించలేరని చెప్పి ఆయన వ్యవహరిస్తున్న తీరుపట్ల కోర్టు కూడా అనేకసార్లు మందలించిందన్నారు.

**బీజేపీకి పక్షపాతం లేదు:**

కేంద్రంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానికి పక్షపాతం లేదని ఈటల అన్నారు. కావాలని దుర్మార్గమైన దుష్ప్రచారం చేస్తున్నారని మీడియా చేతిలో ఉందని పిచ్చి అబద్ధాలు ప్రచారం చేయకండి అన్నారు. రాష్ట్ర భారతీయ జనతా పార్టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. మెట్రో త్వరగా మొదలుపెట్టాలన్నారు. శామీర్ పేట వైపు, మేడ్చల్ వైపు, ఎయిర్పోర్ట్ వైపు, ఫోర్త్ సిటీ వైపు మెట్రో వేయడానికి మేము వ్యతిరేకం కాదు.. కానీ పద్ధతి ప్రకారం చేయండి అని కోరుతున్నామన్నారు. ఫేస్ వన్ లో 13 వేల కోట్ల రూపాయలు, పేస్ టూ 40 వేల కోట్ల రూపాయలు కేంద్రం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. మెట్రో త్వరగా పూర్తి చేయడానికి భారతీయ జనతా పార్టీ ఎంపీలుగా, మంత్రులుగా పూర్తిస్థాయి సహకారం అందిస్తామని అన్నారు.

# జులై 14న కళాశాలల బంద్.. పిలుపునిచ్చిన ABVP

(మొదటి పేజీ తరువాయి)

గతంలో తాము అధికారంలోకి వస్తే గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి ప్రతి నెలా ఫీజులు చెల్లిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి.. తానే విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు రూపాయి విడుదల చేయలేదని ధ్వజమెత్తారు. ఫలితంగా రూ.11,000 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని ఈ వ్యవహారం చివరకు కోర్టు మెట్లు ఎక్కిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏటా 2 లక్షల మంది విద్యార్థులు చదువు ఆపేస్తున్నారన్నారు. సర్టిఫికెట్లు అందక 4.5 లక్షల మంది ఇబ్బంది పడుతూ, పక్క రాష్ట్రాలకు వలస వెళ్తున్నారన్నారు.


**లెక్చరర్ల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత:**

ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు, ప్రభుత్వం కలిసి ఆడుతున్న నాటకంలో పేద విద్యార్థులు బలి అవుతున్నారని, పొట్టకూటి కోసం లెక్చరర్?గా మారిన నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని దీనికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమేనని ఆరోపించారు. సోమవారం కామారెడ్డిలో నిర్వహించిన ఈ భారీ నిరసన ర్యాలీతోనైనా ప్రభుత్వం కళ్ళు తెరవాలని, లేకపోతే ఇదే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి అంకురార్పణ అవుతుందనని హెచ్చరించారు. అన్ని కళాశాల ప్రాంగణాలు, విశ్వవిద్యాలయాలు మరోసారి ఉద్యమ వేదికలై కాంగ్రెస్ పార్టీకి మరణశాసనం రాస్తాయన్నారు. పేద విద్యార్థులను చదువులకు దూరం చేస్తూ రాక్షసానందం పొందుతున్న ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగాాదీవూ ఆధ్వర్యంలో జూలై 14 తేదీన నిర్వహించబోయే రాష్ట్ర వ్యాప్త కళాశాలల బంద్?ను విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# వైద్యరంగంలో AI మరో అద్భుతం..

**ఆకస్మిక గుండెపోటు మరణాలకు చెక్!**

**అంతర్జాతీయం:**



ప్రపంచవ్యాప్తంగా ఆకస్మాతుగా సంభవిస్తున్న గుండెపోటు మరణాలు ఆందోళనకరంగా మారాయి. ఆరోగ్యంగా ఉన్నట్లు కనిపించే వ్యక్తులు కూడా ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోతున్నారు. ముఖ్యంగా కరోనా పరిస్థితుల తర్వాత ఈ సడెన్ కార్డియాక్ డెత్‌లు పెరిగిపోవడం వైద్య రంగానికి పెద్ద సవాలుగా మారింది. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ఉన్నట్టుండి తమ వారు కాలం చేస్తుంటే ఏమి చేయలేని నిస్సాయస్థితుల్లో అనేక మంది ఉండిపోతున్నారు. ఎలాంటి దురలవాట్లు లేని వారి గుండె సైతం లయతప్పుతుండటంతో ఈ పరిస్థితిపై సర్వత్రా ఆందోళన రేకెత్తుతోంది. ఈ నేపథ్యంలో ఈ సమస్యకు కృత్రిమ మేధస్సు (ాౌ×) అద్భుతమైన పరిష్కార మార్గం చూపించింది. సమస్యను ముందుగానే గుర్తించేలా శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనల్లో కీలక ముందడుగు పడింది. ఏఐ సాయంతో ఈ ప్రమాదాన్ని ముందుగానే ఊహించే సరికొత్త గుండె సంకేతాన్ని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. సాధారణ స్క్రీనింగ్ పరీక్షల్లో అంతా నార్మల్‌గా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో రాబోయే ముప్పును ఈ ఏఐ గుర్తించగలదని పరిశోధకులు చెబుతున్నారు.

**దశాబ్ద కాలపు పరిశోధన:**

అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్క్లే పరిశోధకులు సాధారణంగా చేసే ఈసీజీ పరీక్షలో ఇప్పటివరకు వైద్యులకు తెలియని ఓ ప్రత్యేక సంకేతాన్ని ఏఐ ద్వారా గుర్తించారు. ఈ సంకేతం భవిష్యత్తులో ఆకస్మిక గుండె మరణం సంభవించే ప్రమాదాన్ని ముందుగానే అంచనా వేయడంలో సహాయపడుతుందని వెల్లడించారు. బెర్క్లీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ జియాద్ ఒబెర్మేయర్ నేతృత్వంలోని బృందం దాదాపు పదేళ్ల పాటు శ్రమించి ఈ పరిశోధన సాగించింది. స్వీడన్‌కు చెందిన 4,40,000 కంటే ఎక్కువ ఈసీజీ రేఖాచిత్రాలను, మరణ ధృవీకరణ పత్రాలను లింక్ చేసి, వాటిని విశ్లేషించడానికి ఏఐ మోడల్‌కు శిక్షణ ఇచ్చారు. అనంతరం అమెరికా, తైవాన్ దేశాలకు చెందిన రోగుల డేటాతో దీనిని నిర్ధారించినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో సాధారణంగా వైద్యులు గమనించలేని సరికొత్త వేవ్‌ఫార్మ్ ప్యాటర్న్‌ను ఈ ఏఐ గుర్తించిందని ఇది వైద్య శాస్త్రానికి ఇప్పటివరకు తెలియని ఒక సరికొత్త జీవసంబంధిత క్లూ అని పేర్కొన్నారు.

**86 శాతం మందికి కొత్తగా గుర్తింపు:**

ప్రస్తుతం వైద్యులు గుండె పంపింగ్ సామర్థ్యాన్ని సూచించే LVEF (Left Ventricular Ejection Fraction) ఆధారంగా గుండెపోటు ప్రమాదాన్ని అంచనా వేస్తున్నారు. అయితే సాధారణ ాంజుఖీ ఉన్నవారిలో కూడా సడన్ కార్డియాక్ డెత్ సంభవిస్తున్నట్లు ఇప్పటికే పలు సందర్భాల్లో స్పష్టం అయింది. అయితే ఏఐ మాత్రం సంప్రదాయ పరీక్షలకు కనిపించని ప్రమాద సంకేతాలను కూడా గుర్తించగలిగిందని పరిశోధకులు తెలిపారు. ప్రస్తుత పద్ధతుల ప్రకారం గుండెపోటు ముప్పు 4.6 శాతంగా ఉంటే, ఈ ఏఐ ద్వారా గుర్తించిన రోగులలో వార్షిక ముప్పు 7 శాతం గా ఉన్నట్లు తేలింది ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాలతో పోలిస్తే ఇది 86 శాతం మంది అధిక ప్రమాదంలో ఉన్నవారిని అదనంగా గుర్తించగలిగిందని పరిశోధకులు వెల్లడించారు.

# అనారోగ్యంతో ఉన్న సీనియర్ జర్నలిస్టును పరామర్శించిన సీపీఐ నాయకులు

**నిర్భయవార్త ప్రతినిధి :**

అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ జర్నలిస్ట ఆయిలి రాజేశంను సీపీఐ నాయకులు సోమవారం ఆయన స్వగ్రామం కొత్తపల్లిలో పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మనోధైర్యం కల్పించారు. సమాజ సమస్యలను వార్తల రూపంలో ప్రజలకు చేరవేస్తూ జర్నలిజం రంగంలో విశిష్ట సేవలు అందించిన



రాజేశం త్వరగా కోలుకుని మళ్లీ యథావిధిగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్, సహాయ కార్యదర్శి నరాల ప్రహ్లాద్, చంద్రవెల్లి గ్రామ కార్యదర్శి కొండు సాయికుమార్ పాల్గొన్నారు.

## ఐటీడీఏ నిధులు సంక్షేమ పథకాల జీవో లా గురించి వివరించిన ఆలం సుష్మ..



దుమ్ముగూడెం జులై 6 నిర్భయ వార్త ప్రతినిధి. దుమ్మగూడెం ఆదివాసి గ్రామాల్లో పర్యటన ఆదివాసి స్థితిగతులు ఆచారాలు సంప్రదాయాల ఆదివాసి 3 జీవో ఆదివాసి విద్యార్థులు చదువులపై ఐ.టీ డి. ఏ నియమకాలు నిధులు సంక్షేమ పథకాలు గురించి ఆదివాసులతో చర్చించి తప్పనిసరిగా ఏవైతే ఆదివాసులు కోసం ఏర్పాటు చేసిన వంటి జీవోలు గాని ఐటీడీ ఏ నుండి వచ్చే ఉపాధి కల్పన ఉద్యోగాలు సబ్సిడీలు ఆదివాసులకు రావాల్సిన ప్రత్యేక నిధులను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తామని గ్రామస్తులు ఉద్దేశించి మాట్లాడడం జరిగినది ఈ కార్యక్రమంలో భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెల్లం హరికృష్ణ జిల్లా ప్రధాన కార్యదర్శి పిలక వెంకటరమణారెడ్డి జిల్లా నాయకులు ఎండి జిందా గారు పర్ణశాలజుఇ సర్పంచ్ తెల్లం. వరలక్ష్మి పంచాయతీ ఉప సర్పంచ్ వాగి. శ్రీధర్ దుమ్ముగూడెం యూత్ ఉపాధ్యక్షులు కారం నవీన్ వార్డ్ మెంబర్లు సవ్వలం భద్రయ్య వాగే. అల్లేశ్ కాంగ్రెస్ యువ నాయకులు. వాగే భరత్ కాగితాల శివకుమార్ కొమరం గజేందర్. శంకర్ సోయం వీర్రాజు పూనం వెంకటేశు చింతం రమేష్. మహిళా నాయకులు ద్రాక్షాయని రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## 1.20 కోట్ల రూపాయలతో 15 నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభోత్సవ..

**మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ , స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు..**



భద్రాచలం జులై 6 నిర్భయ వార్త ప్రతినిధి భద్రాచలం పట్టణంలోని ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతో సోమవారం ఉదయం భద్రాచలంలోని పలు ప్రాంతాల్లో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు శ్రీ పోరిక బలరాం నాయక్ , స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు , భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ , ఉపసర్పంచ్ రత్నం కవిత వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు. సుభాష్ నగర్ కాలనీ, మెడికల్ కాలనీ, ఐటిడిఎ రోడ్, సెంట్ పాల్స్ స్కూల్ సమీపం, వెంకటేశ్వర కాలనీ, రాజుపేట కాలనీల్లో లో వోల్టేజ్ ప్రాబ్లంని గ్రహించి 15 నూతన ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను బలోపేతం చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ , ఉపసర్పంచ్ రత్నం కవిత వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ నాయకులు, మహిళ నాయకురాలు, అభిమానులు, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మారుమూల ఆదివాసి గిరిజనులకు గర్భిణీ స్త్రీలకు సీజనల్ వ్యాధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలి

**ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ ఆదేశాల మేరకు**

భద్రాచలం 06 జూలై నిర్భయ వార్త ప్రతినిధి. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ ఆదేశాల మేరకు మారుమూల ప్రాంత ఆదివాసి సమస్యాత్మకమైన గిరిజన గ్రామాలలో గర్భిణీ స్త్రీలను గుర్తించాలని అలాగే సీజనల్ వ్యాధులపై సంబంధిత వైద్యా



ధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఏడిఎంహెచ్వో సైదులు సూచించారు. సోమవారం నాడు ఐటిడిఎ కార్యాలయంలోని తన చాంబర్లో ఏజెన్సీ ఏరియాలలో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్లు స్టాఫ్ నర్సులతో గిరిజన గ్రామాలలో ప్రభలే సీజనల్ వ్యాధులపై తీసుకోవలసిన కార్యాచరణపై ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యాధికారులకు కొన్ని సూచనలు ఇస్తూ మారుమూల ప్రాంత గిరిజన గ్రామాలలో ఉండే గర్భిణీ స్త్రీలను గుర్తించి వారికి పీహెచ్సీకి తరలించి సుఖ ప్రసాదం జరిగేలా చూడాలని, అదేవిధంగా గుత్తి కోయ గ్రామాలలో మలేరియా డెంగు కేసులు పెరగకుండా హెల్త్ క్యాంపులు నిర్వహించి అందరికీ వైద్య పరీక్షలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల వైద్యాధికారులు స్టాఫ్ నర్సులు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పట్టా భూముల్లో సాగులో ఉన్న ఆదివాసీల పైన కేసులు పెట్టిన అటవీ శాఖ అధికారుల పై కఠిన చర్యలు తీసుకోవాలీ

**జిల్లా కలెక్టర్ హేమంత్ కు ఫిర్యాదు చేసిన ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి.**

**సమత జడ్జిమెంట్,ఎల్ టి ఆర్, పెసా చట్టాలను ఉల్లంఘించిన అటవీ శాఖ అధికారులు**

**పెసా ఎల్ టి ఆర్ అటవీ హక్కుల గుర్తింపు చట్టాలను అ గౌరవ పరుస్తున్న అధికారులు**

**అటవీ శాఖ అధికారుల అక్రమ కేసుల ఉదంతం పై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం**

**ఏజెన్సీ విద్య పై సమీక్ష పెట్టండి.**

**ఏకోపాధ్యాయ పాఠశాలలు బాలకార్మికులను తయారు చేసే ప్రభుత్వ పాఠశాలలగా మారాయి**



ములుగు జూలై 06, (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)విద్య ద్వారానే సర్వతో ముఖాభివృద్ధి జరుగుతుందని మేధావులు, విద్యావంతులు ఆర్థిక వేతలు సైతం చెప్తున్నారు. కానీ నేటికీ ఆదివాసీ ప్రాంతాల్లో విద్య మిద్య గానే మిగిలింది అని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి పేర్కొన్నారు. వెంకటాపురం వాజేడు ఏజెన్సీ మండలాల్లో విద్య పరిస్థితి అడవికాసిన వెన్నెల లాగ మారిందని నర్సింహా మూర్తి అన్నారు. ఏజెన్సీ సమస్యల పై ఆయన సోమవారం ములుగు కలెక్టర్ హేమంత్ ని తన కార్యాలయంలో కలిసి మెమోరాడం ఇచ్చారు. ఏజెన్సీ మండలాలు కావడంతో కొంతమంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదన్నారు. వాజేడు వెంకటాపురం మండలాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలు 18, ఉపాధ్యాయులు లేని పాఠశాలలు 8 ఉన్నాయని కలెక్టర్ హేమంత్ కు వివరించారు. అసలే ఏజెన్సీ విద్య పై సరైన అవగాహనా లేని ఆదివాసీలు అధికంగా ఉన్నారని అన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు రద్దు చేయాలని, బాలకార్మికులను తయారు చేసే ప్రభుత్వ సంస్థలుగా మారినాయని వీటిని తక్షణమే రద్దు చేయడం గాని, ఉపాధ్యాయులను నియమించడం గాని చేయాలని కలెక్టర్ ని కోరినారు. ఏజెన్సీ లో 1:20 విధానాన్ని కాకుండా ప్రత్యేక చొరవతో తరగతుల ఆధారంగా ఉపాధ్యాయులను నియమించాలని అన్నారు. ఏజెన్సీ లో విద్యావా లంటీర్లను తక్షణమే నియమించాలని కోరినట్లు తెలిపారు. ఆదివాసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వాలు విఫల యత్నం చేస్తున్నాయని అన్నారు. రాజ్యాంగ బద్ధంగా ప్రాథమిక ఉచిత నిర్బంద విద్య ఆదివాసీలకు లభించినప్పటికి దాని అడవి బిడ్డలకు అందించడంలో ప్రభుత్వ చిత్త శుద్ధి లోపిస్తోందని అన్నారు. లోపభూయిష్టమైన విధానాల వల్ల అడవి బిడ్డలకు విద్య అందని ద్రాక్ష గానే ఉందన్నారు

రెవిన్యూ పట్టాలు ఉన్న పేరూరు ఆదివాసీల భూములను అటవీ శాఖ అధికారులు దౌర్జన్యంగా గుంజుకోవడానికి రైతుల పైన, సదును చేస్తున్న మిషన్ పైన అక్రమ కేసులు

బనాయించిన ఎఫ్ బిఓ సెక్షన్ ఆఫీసర్స్ పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ని కోరినట్టు వివరించారు. కేసులు పెట్టే ముందు రైతులకు నోటీసులు ఇవ్వడం గాని రైతుల దెగ్గర పట్టాలు ఉన్నాయా లేవా అని అడగకుండా చేయకుండా అన్యాయం గా అమాయక ఆదివాసీ రైతుల కేసులు పెట్టినారని అన్నారు. షెడ్యూల్ ఏరియాలో పెసా గ్రామ సభలకే అత్యున్నత అధికారం ఉందన్నారు. వివాదంలో ఉన్న భూమికి రెవిన్యూ పట్టాలు ఉన్నాయా లేవా, అ భూమి అటవీ భూమి నా కాదా అని పెసా గ్రామసభ ద్వారా తెలుసుకొని కేసులు పెట్టాలని అన్నారు. సమత, నియామగిరి జడ్జిమెంట్ లు షెడ్యూల్ చట్టాల గురించి ఏమి చెప్తున్నాయని అధికారులు తెలుసుకోవాలని అన్నారు. జాయింట్ సర్వే ద్వారా అవి రెవిన్యూ పట్టాలు, మ్యాప్ లు అన్ని రకాల భూమి దస్త్రాలు ఆదివాసీ రైతులకు ఉన్నటు సర్వేలో తెలిందన్నారు. అయినప్పటికీ ఆదివాసీల పైన మిషన్ పైన పెట్టిన కేసులు వెనక్కి తీసుకోలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ భూ వివాదం పై సమగ్ర విచారణ చేపట్టి ఆదివాసీలకు వెలికి తీయాలని ఆదివాసీల పైన పెట్టిన కేసులను ఎటువంటి షరతులు లేకుండా రద్దు చేయాలని అన్నారు. ఎల్ టి ఆర్, పెసా చట్టాలను ఉల్లంఘించిన అటవీశాఖ పైన కేసులు పెట్టాలన్నారు. అన్ని సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని కలెక్టర్ హేమంట్ హామీ ఇచ్చినట్టు నర్సింహా మూర్తి తెలిపారు.

## ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత పాటించాలి

**కలెక్టర్ మను చౌదరి**

మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్ జూలై 06 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన



ప్రజా ఫిర్యాదులు, వినతిపత్రాలను సంబంధిత శాఖల అధికారులు జాప్యం లేకుండా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 79 దరఖాస్తులను కలెక్టర్, లా ఆఫీసర్ చంద్రావతి, డీఆర్వో మాలతితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకంతో ప్రజలు వ్యయప్రయాసలు భరించి ప్రజావాణికి వస్తారని, వారి విశ్వాసాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, ఏదైనా దరఖాస్తును తిరస్కరించాల్సిన పరిస్థితి ఏర్పడితే, తిరస్కరణకు గల కారణాలను పూర్తి వివరాలతో సంబంధిత





అర్జీదారులకు తప్పనిసరిగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పరిష్కార ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి.

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి.**

భద్రాచలం జూలై 6 నిర్భయ వార్త ప్రతినిధి. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్యుమరేషన్ ఫాం ల



పంపిణీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ, డిజిటలైజేషన్ పై అన్ని జిల్లాల కలెక్టర్లు మరియు ఈ ఆర్ ఓ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడువులోగా ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఇప్పటివరకు పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ వివరాలు సమీక్షించారు. బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓలు) తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ఫాం లు అందివ్వాలని అన్నారు. బిఎల్ఓ లు మాత్రమే ఫాంలు పంపిణీ చేయాలని, బిఎల్ఎ లు గానీ, ఇతర రాజకీయ పార్టీల వారికి గానీ ఎన్యుమరేషన్ ఫాం లు పంపిణీ చేసే అధికారం లేదని స్పష్టం చేశారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై సందేహాలు నివృత్తి చేయడానికి అవసరమైతే అదనపు హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎప్పటికప్పుడు వివిధ మీడియా మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు పినపాక నియోజకవర్గం మణుగూరు తాసిల్దార్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈ వీసీలో



పినపాక నియోజకవర్గం ఈఆర్ఓ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వీసీలో భాగంగా ఆయన మాట్లాడుతూ పినపాక నియోజకవర్గంలో ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియ 90 శాతం పూర్తయిందన్నారు. అన్ని నియమాలు పాటిస్తూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని, డిజిటల్ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని, ఎప్పటికప్పుడు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ మణుగూరు తహసీల్దార్ నరేష్, ఎలక్షన్ డిటి అనూష, ఆర్ ఐ లు రామారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సుప్రభాత్ కాలనీ సమస్యల పరిష్కారానికి ఏనుగు సుదర్శన్ రెడ్డి చొరవ

**తాగునీరు, ఆటస్థలాల అభివృద్ధికి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి హామీ**



ఘట్కేసర్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పోచారం డివిజన్ కాచవాని సింగారం గ్రామంలోని సుప్రభాత్ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీవాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యతో పాటు ఆటస్థలాల అభివృద్ధికి సంబంధించిన వినతిపత్రాన్ని జీహెచ్ఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి (ఐఏఎస్)కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి కమిషనర్‌ను కలిసి, కాలనీలో నెలకొన్న తాగునీటి కొరతను అత్యవసరంగా పరిష్కరించాలని, స్థానిక ఆటస్థలాలను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి కాలనీకి తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. వినతిని స్వీకరించిన కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను వెంటనే ఆదేశిస్తూ, తాగునీటి సమస్యతో పాటు ఆటస్థలాల అభివృద్ధిపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన నివేదిక సమర్పించాలని సూచించారు. నివేదిక అందిన వెంటనే సుప్రభాత్ కాలనీలో తాగునీటి సరఫరాను మెరుగుపరిచే చర్యలు ప్రారంభించడంతో పాటు ఆటస్థలాల సుందరీకరణ పనులను కూడా త్వరలో చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చారు. కమిషనర్ సానుకూలంగా స్పందించడంతో పాటు సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఏనుగు సుదర్శన్ రెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ది స్నేహ, కే. నరేందర్ రెడ్డి, కే. శ్రీనివాస్ రెడ్డి, రాకేష్, శశిధర్ రెడ్డి, కే. వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దోమల లార్వా నిర్మూలనే వ్యాధుల నివారణకు కీలకం:

కీసర, నిర్భయవార్త జిల్లా ప్రతినిధి:కీసర డివిజన్ పరిధిలోని స్నేహ




కాలనీతో పాటు సాకలికుంట చెరువు ప్రాంతంలో దోమల నివారణ చర్యలను డిప్యూటీ కమిషనర్ జి. రామలింగం సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా యాంటీ లార్వల్ ఆపరేషన్ బృందం సాకలికుంట చెరువులో దోమల లార్వా పరిస్థితిని తనిఖీ చేసింది. అలాగే ఎంటమాలజీ విభాగం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి దోమల నివారణ మందులను పిచికారీ చేస్తున్నారా లేదా అనే అంశాన్ని డిప్యూటీ కమిషనర్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీవాసులతో మాట్లాడుతూ, దోమల వల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున లార్వా దశలోనే వాటిని నిర్మూలించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమలు పెరిగే పరిస్థితులను నివారించాలని ప్రజలకు సూచించారు.

## నారాయణ పాఠశాలలో ఘనంగా వన మహోత్సవం



తార్నాక, నిర్భయవార్త ప్రతినిధి:తార్నాకలోని నారాయణ పాఠశాలలో సోమవారం వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీఎం గోపాల్ రెడ్డి, ఎంజీఎం బాల పరమేశ్వరరావు హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పర్వీన్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యార్థులు ప్రతి సంవత్సరం కనీసం ఒక మొక్క నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. "పచ్చని చెట్లు -- ప్రగతికి మెట్లు", "వృక్షో రక్షతి రక్షితః" వంటి పర్యావరణ పరిరక్షణ నినాదాలతో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొని వన మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

## శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ఘన నివాళులు

జులై 6(నిర్భయవార్త) జిల్లా ప్రతినిధి: జిల్లా ప్రధాన కార్యాలయ బీజేపీ కార్యాలయంలో అఖండ భారతవణి కోసం ప్రాణాలు కోల్పోయిన జనసంఘ వ్యవస్థాపకులు,మహనీయ దేశభక్తుడు డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్ రావు, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు దేశ్ పండే, శంషాబాద్ రాజు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మీనా గౌడ్, భాజపా తాజా ప్రజా ప్రతినిధులు, జిల్లాల్లో గల మండల అధ్యక్షులు వీరేష్, ఈర్ల ముదిరాజ్,ఐలేష్, జగన్ రెడ్డి,ఆనంద్ కృష్ణారెడ్డి, రామచంద్రపురం డివిజన్ అధ్యక్షులు ఆనంద్ తదిరులు పాల్గొన్నారు



## జిల్లాలోని ప్రజావాణిలో 66 ఫిర్యాదులు



జులై 6 (నిర్భయవార్త) జిల్లా ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను అధికారులు సత్వరంగా,పారదర్శకంగా పరిష్కరించాలని కలెక్టర్ ప్రతిక్ జైన్ ఆదేశించారు! సోమవారం కలెక్టరేట్ లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్,నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంగీత, పాండు తదిరులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తము 66 ఫిర్యాదులు అందగా కలెక్టరేట్లో 35, సంగారెడ్డిలో 13,జహీరాబాద్ 12, నారాయణఖేడ్ లో 6 ఫిర్యాదులు నమోదు కాగా అందోల్ లో ఒకటి కూడా నమోదు కాలేదు.

## డ్రైనేజ్ వ్యవస్థ నిర్మాణంపై వినతి.

సింగరేణి జూలై 06 నిర్భయవార్త రిపోర్టర్.సింగరేణి మండల కేంద్రంలో మురుగు నీటిమయంగా మారి ప్రజలను అవస్థల పాలు చేస్తుందని, అపరిశుభ్రతపై అధికారులు స్పందించాలని కోరుతూ డీవైఎఫ్ఐ సోమవారం ప్రజావాణిలో వినతిప్రతం అందజేసింది. వర్షపు నీరు, ఇళ్ళలో వాడుకుంటున్న నీరు రోడ్లమీదకు వచ్చి రోడ్లపై నడవలేని పరిస్థితి ఉందని వినతిలో తెలిపారు. ఈసందర్భంగా డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి ఆదెర్ల వినయ్ కుమార్ మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కారేపల్లి వీధులలో మురుగునీరు నిలువ ఉంటుందన్నారు. మసీదు రోడ్డు, మోడల్ స్కూల్ రోడ్డు , కారేపల్లి బస్టాండ్ సెంటర్, బీసీ కాలనీ, భరత్ నగర్, అంబేద్కర్ నగర్ లలో రహదారిపై మురుగునీటితో పాటు ఖాళీగా ఉన్న ప్లాట్లలో పిచ్చి మొక్కలు పెరిగి పందులు. దోమలు. కుక్కలకు నేలవుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అస్థవ్యస్త పారిశుధ్యంపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరు పట్టించుకుంటున్న దాఖలా లేదని విమర్శించారు. వర్షాకాలం కావడంతో పరిస్థితి మరి అధ్వానంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొన్నదని, ప్రజలు రోగాల భారిన పడే అవకాశం ఉందన్నారు. ప్రజలు జబ్బులు బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశుధ్య చర్యలు చేపట్టకుంటే డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బాధిత ప్రజలను సమీకరించి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.



## కేజీబీవీలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ములుగు జూలై 06, (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో 2026--27 విద్యా సంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారి శిరీష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.కేజీబీవీలో విద్యార్థినులకు ఉచిత విద్యతో పాటు వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు తదితర సౌకర్యాలు ప్రభుత్వం ద్వారా అందించబడుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం 6వ తరగతిలో 10 సీట్లు,7వ తరగతిలో 8 సీట్లు,9వ తరగతిలో 3 సీట్లు, ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఎంపీహెచ్డబ్ల్యూ (ఫిమేల్) మొదటి సంవత్సరంలో 31 సీట్లు,2వ సంవత్సరంలో 30 సీట్లు,ఇంటర్మీడియట్ 1వ సంవత్సరం సిఈసీ గ్రూపులో 31 సీట్లు,2వ సంవత్సరం 31 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు.అర్హత గల విద్యార్థినులు అవసరమైన ధ్రువపత్రాలతో వెంటనే కేజీబీవీ వెంకటాపురం పాఠశాల, కళాశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేకాధికారి శిరీష సూచించారు.



## ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతికి నిర్దేశిత గడువులో పరిష్కారం చూపాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం జులై 6 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి )ప్రజా వాణిలో ప్రజలు సమర్పించే ప్రతి వినతిని అ త్యంత ప్రాధాన్యతతో పరిశీ లించి, నిర్ణీత గడు వులోగా పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.సోమవారం ఐ డి ఓ సి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతితో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. భూ వివాదాలు, రెవెన్యూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలిక వసతులు, సామాజిక భద్రత, ఇతర శాఖలకు సంబంధించిన వివిధ సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పంపిస్తూ, నిర్దేశిత కాలవ్యవధి లో పరిష్కరించాలని ఆదేశించారు.




తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, మిగిలిన వినతులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేసే విశ్వసనీయ వేదిక అని అన్నారు . ప్రజల వినతులను కేవలం నమోదు చేయడం కాకుండా, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించి ఫలితాలు కనిపించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని తెలిపారు.ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి ఏమాత్రం తావు లేకుండా ప్రతి అధికారి బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని వినతులుసుజాతనగర్ మండలం సింగభూపాలెం గ్రామానికి చెందిన సంఘం నాగేశ్వరరావు, తన తండ్రి మరణించడంతో ఆయన పేరుపై ఉన్న పట్టా భూమిని వారసత్వ హక్కు ప్రకారం తన పేరుకు మార్చాలని చేసిన వినతిని జిల్లా కలెక్టర్ పరిశీలించి, తదుపరి చర్యల కోసం సంబంధిత సెక్షన్ సూపరింటెండెంట్‌కు ఎండార్స్ చేశారు.లిటేకులపల్లి మండలం రాజు తండా గ్రామానికి చెందిన అజ్మీర రవి, కొత్తగూడెం--ఇల్లందు జాతీయ రహదారి విస్తరణలో తన ప్రహరీ గోడతో పాటు మూడు గదుల ఇల్లు కోల్పోతున్నందున తగిన నష్టపరిహారం మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి, అవసరమైన చర్యల కోసం టేకులపల్లి తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.

లిఇల్లందు మండలం ఇందిరానగర్‌కు చెందిన పోతరాజు రమేష్, గత నాలుగు సంవత్సరాలుగా తీవ్రమైన శారీరక, మానసిక వైకల్యంతో బాధపడుతూ, 50 శాతం వైకల్యం ఉన్నందున కుటుంబానికి ఆర్థిక ఆధారం లేక చికిత్స భారంగా మారిందని పేర్కొంటూ వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును జిల్లా కలెక్టర్ పరిశీలించి, తదుపరి చర్యల కోసం సంబంధిత అధికారికి ఎండార్స్ చేశారు.

## జూలై 10న కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

భద్రాచలం జూలై 6 నిర్భయ వార్త ప్రతినిధి తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలకు వ్యతిరేకంగా, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు జూలై 10న పిలుపునిచ్చిన కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్‌కు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని, ఈ బంద్ కు సంబంధించిన గోడ పత్రికను హిమాయత్ నగర్ లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ/కల్లూరు ధర్మేంద్ర. మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేయడం, విద్యార్థుల సంఖ్య పేరుతో పాఠశాలలను మూసివేసే ప్రయత్నాలు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, వీజూ, ఐజూ తదితర కీలక పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల ప్రభుత్వ విద్య తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు . మరోవైపు పాఠశాలలు, ఇంటర్ కళాశాలలు, గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో భవనాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, ల్యాబ్‌లు, లైబ్రరీలు, ఆటస్థలాలు వంటి మౌలిక సదుపాయాల కొరత విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సింది పోయి ప్రైవేట్,కార్పొరేట్ విద్యను ప్రోత్సహించే విధానాలను అమలు చేస్తోందన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు, డొనేషన్లు, క్యాపిటేషన్ ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నా ప్రభుత్వం నియంత్రణలో విఫలమైందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలను ఖచ్చితంగా అమలు చేయాలని , ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని , ప్రభుత్వ విద్యాసంస్థలకు తగిన నిధులు విడుదల చేసి నాణ్యమైన విద్య అందించాలని , చీజూ-2020 అమలుకు ముందు ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యావేత్తలు, ప్రజాసంఘాలతో విస్తృత చర్చలు నిర్వహించాలి అని ఏఐవైఎఫ్ డిమాండ్ చేస్తున్నదన్నారు విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు. ప్రభుత్వ విద్యను కాపాడడం, పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన, ఉచిత, అందుబాటు విద్యను అందించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యత. ఈ బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పించుకోకుండా ప్రజల ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందన్నారు . అందువల్ల జూలై 10న జరిగే కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్‌ను విద్యార్థులు, యువజనులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదులు విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపునిస్తోందన్నారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.






## సర్ పై అప్రమత్తంగా ఉండాలి జిఎంఆర్



జులై 6 (నిర్భయవార్త) జిల్లా ప్రతినిధి : పటన్ చెరువులో ఎస్సై ఆర్ ప్రక్రియపై ప్రభుత్వం ఓటర్లకు సరైన అవగాహన కల్పించడంలో విఫలమైందని పటాన్చెరు శాసనసభ్యులు గుడం మైపాల్ రెడ్డి సోమవారం నాడు ఆరోపించారు అర్హులైన ప్రతి ఓటు నమోదు అయ్యేలా బిఎల్వోలు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు జూలై 12న జిఎంఆర్ కన్వెన్షన్ లో మాజీ మంత్రి హరీష్ రావు ఆధ్వర్యంలో ఎస్ఐఆర్, బి.ఆర్.ఎస్ డిజిటల్ సభ్యత్వం పై అవగాహన సద్దసు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కార్యకర్తలు భారి ఎత్తున తల్లిని రావాలని పిలుపునిచ్చారు.

## విద్యార్థులు ఇష్టంతో చదవాలి



జూలై 6(నిర్భయవార్త) జిల్లా ప్రతినిధి :పటాన్ చెరువు విద్యార్థులు ఇష్టంతో చదివి మంచి మార్కులు సాధిస్తారని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు.పటాన్ చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓ పాండేషన్ ఆధ్వర్యంలో గత సంవత్సరం పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన 30 మంది విద్యార్థులకు పురస్కర కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పటాన్ చెరువు .శాసనసభ్యులు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు.

## పాఠశాలకు 179 మంది కంప్యూటర్ బోధకులు



జులై 6(నిర్భయవార్త) జిల్లా ప్రతినిధి సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు 179 మంది కంప్యూటర్ బోధకుల నియామకానికి అనుమతి లభించినట్లు జిల్లా విద్యాధికారి రోహిణి తెలిపారు! పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నుంచి ఆదేశాలు అందాయని,ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. డిజిటల్ రిటర్నింగ్ చేయడమే లక్ష్యంగా ఈ నియమకాలు చేపడుతున్నామని, త్వరలోనే భర్తీ ప్రక్రియ ప్రారంభిస్తామని వెల్లడించారు.


## స్కాలర్ షిప్ల కోసం కలెక్టరేట్ ముందు ధర్నా



జులై 6(నిర్భయవార్త) జిల్లా ప్రతినిధి: పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ల ఫీజుల రిమెంబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం మహాధర్న నిర్వహించారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అనంతరం కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు! కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రమేష్ కార్యదర్శి సతీష్ తో పాటు నాయకులు, విద్యార్థులు తదిరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నల్గురికి రిమాండ్.

సింగరేణి జులై 6 నిర్భయవార్త రిపోర్టర్. కారేపల్లిలోని ఓ గురుకులంలో ఇంటర్ చదువుతున్న బాలికను కిడ్నాప్ చేసిన నలుగురిపై కిడ్నాప్, పోక్సో కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్సై బైరు గోపి తెలిపారు. నిందితులను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఈనెల 4వ తేదిన గురుకులంలో సిబ్బందికి బాలిక బంధువులమని నమ్మ బలికి బాలికకు మాయమాటలు చెప్పి బయటకు వెళ్ళటానికి నింధుతులు గంట పర్మిషన్ తీసుకున్నారు. పర్మిషన్ తో గురుకులం నుండి తీసుకెళ్ళిన బాలిక ఎంతకు గురుకులంకు రాక పోవటంతో సిబ్బంది ద్వారా తెలుసుకున్న కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ దుర్గాభవాని పోలీసులకు పిర్యాదు చేసింది.



# ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎమ్‌లకు సబ్ సెంటర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్ నిర్వహణ

### జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్



కొత్తగూడెం జులై 6 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా జిల్లాలోని పలు ఆరోగ్య ఉప కేంద్రాల్లో రెగ్యులర్ ఏఎన్ఎమ్‌లు విధుల్లో చేరిన నేపథ్యంలో, ఖాళీగా ఉన్న ఉప కేంద్రాలకు ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎమ్‌లను కేటాయించేందుకు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్ మాట్లాడుతూ, కౌన్సెలింగ్ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, సీనియారిటీ మరియు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఉప కేంద్రంలో ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.నూతనంగా కేటాయించిన ఉప కేంద్రాల్లో ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎమ్‌లు వెంటనే విధుల్లో చేరి, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, శిశువులు, చిన్నారులకు అవసరమైన ఆరోగ్య సేవలు, టీకాల కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణ సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.జిల్లాలోని ప్రతి ఆరోగ్య ఉప కేంద్రంలో ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా వైద్య సేవలు అందేలా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని డా. తుకారాం రాథోడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ సూపర్డెంట్ డిప్యూటీడెమో నాగలక్ష్మి డిపిఎంవోమోహన్, హెల్త్ సూపర్వైజర్లు శ్రీనివాసరావు, రాంప్రసాద్, జానకి సుశీల ఉమాదేవి విజయలక్ష్మి యూనియన్ నాయకులు పాల్గొన్నారు

# వెంకటాపురం మండల వరద బాధితులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి

### ఆదివాసి సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షులు పర్శిక సతీష్



ములుగు జూలై 06, (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)ములుగు జిల్లా కేంద్రంలో ప్రజా పాలనలో కలెక్టర్ వారికి ఆదివాసి సమస్యలు ఏజెన్సీలో అంగన్వాడి ఉద్యోగాలు100% ఆదివాసి మహిళలతో భర్తీ చేయ్యాలి వెంకటాపురం మండల వరద బాధితులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ప్రజా పాలన లో ములుగు జిల్లా కలెక్టర్ గారికి మెమోరాండం అందజేశారు ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షులు పర్శిక సతీష్ మాట్లాడుతూ 5వ షెడ్యూల్డ్ ప్రాంతాలలో షెడ్యూల్డ్ ఏరియా గ్రామాల అంగన్వాడి పోస్టులు 100% స్థానిక ఆదివాసి(ఎస్టీ) మహిళలతో భర్తీ చేయాలని , వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామ పంచాయతీ ముత్తారం 2 అంగన్వాడి టీచర్ ను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. వెంకటాపురం మండల అధ్యక్షులు తుర్స కృష్ణబాబు , తాటి రాంబాబు మాట్లాడుతూ 5వ ఏజెన్సీ ప్రాంతాల్లో వర్షాకాలంలో భారీ వర్షాల వల్ల వరదలు సంభవించినప్పుడు అక్కడి ఆదివాసి ప్రజలు ఎదుర్కొనే సమస్యలు,భౌగోళిక పరిస్థితులు,రవాణా సౌకర్యాలు లేక బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయి ఆదివాసి ప్రజలు నానా ఇబ్బందులు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటాపురం మండలం ఉప్పేడు వీరాపురం గ్రామ పంచాయతీ పరిధిలో కోయ బెస్తగూడెం, తుర్సవానిగూడెం,టేకుల బోరు,లక్ష్మీపురం, ముత్తారం,సీతారాంపురం, కలిపాక గ్రామాలలో ప్రతి సంవత్సరం వరదలు సంభవించినప్పుడు అక్కడి ప్రజలు ఆర్థిక సమస్యలు వచ్చినప్పుడు మౌలిక వసతులు అందకపోవడం వల్ల గిరిజన గ్రామాలు భాహ్య ప్రపంచంతో పూర్తిగా రాకపోకలు తెగిపోతాయని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో వరదలు తగ్గాక మలేరియా,డెంగ్యూ టైఫాయిడ్, విరోచనాలు వంటి అంటు వ్యాధులు వస్తాయని వాపోయారు. వెంకటాపురం వరద బాధితులకు శాశ్వత పరిష్కారం చూపించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు తుర్స కృష్ణ బాబు,ఉపాధ్యక్షులు తాటి రాంబాబు,సోడి గోపి,చంద సూరిబాబు,కాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లిలో ఘనంగా పెద్దమ్మతల్లి 9వ,వార్షిక బ్రహ్మోత్సవం.

### అన్నదానాన్ని ప్రారంభించిన సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్.



సింగరేణి జులై 06 నిర్భయవార్త రిపోర్టర్. కారేపల్లిలోని పురాతన దేవాలయమై శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల రెండు రోజు ఆలయంలో అర్చకులు ముక్కామాల మల్లిఖార్జున శర్మ, సురేష్ శర్మ ల ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకములు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులతో కుంకుమ పూజలు, గణపతి, మృత్యుంజయ నవగ్రహా శాంతి పూజలు జరిపించారు. ఈ పూజలలో కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు దంపతులు, సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్(టోనీ) పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం కమిటీ అధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్ (టోనీ) ప్రారంభించారు.



ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తురక నారాయణ, పెర్ని వెంకటేశ్వర్లు, పొలగాని శ్రీ నివాసరావు,పెద్దమ్మ సత్యనారాయణ, తురక రాంబాబు, పాసిన్ని నాగేశ్వరరావు, పోతు రాములు, ఓరుగంటి రంగనాథ్, ఎనిక రవి చింతల సంపత్, యర్ర మాధవ్, తురక రవి, మల్లేష్, ముక్కా సీతారాములు, యవగందుల మధు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రి సీతక్క చిల్లర మాటలు మాట్లాడటం బాధాకరం

### ప్రజల సెంటిమెంట్‌తో ఆడుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయం
### బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు




ములుగు జూలై 06 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర మంత్రి సీతక్క చేసిన వ్యాఖ్యలను ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు తీవ్రంగా ఖండించారు. ఈ రోజు ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అత్యవసర విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మహానేత కేసీఆర్ వారి పవిత్ర సంకల్పం, తెలంగాణ రైతాంగానికి మేలు జరగాలి, రాష్ట్రం సస్యశ్యామలం కావాలనే పవిత్రమైన ఆలోచనతో నాటి ముఖ్యమంత్రి, అపర భగీరథుడు కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టును నిర్మించారని లక్ష్మణ్ బాబు కొనియాడారు.మహా శక్తివంతమైన భగవంతుడు, ఆ ప్రాంతంలో కొలువై ఉన్న శివుడి పేరు మీద కేసీఆర్ ఈ ప్రాజెక్టుకు కాళేశ్వరం అని నామకరణం చేశారని గుర్తుచేశారు. భగవంతుని పేరున్న ప్రాజెక్టును ఉద్దేశించి మంత్రి సీతక్క సినిమా డైలాగులు కొడుతూ, దాన్ని కూలేశ్వరం అంటూ చిల్లర మాటలు మాట్లాడటం అత్యంత బాధాకరమన్నారు.

ప్రజల సెంటిమెంట్‌ను గాయపరిచేలా మాట్లాడితే.. ప్రాజెక్టును కూల్చడం కాదు, వచ్చే రోజుల్లో ఈ ప్రజలే మీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడం ఖాయమని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిధుల ఎత్తిపోతల పథకం" అని విమర్శించడం మంత్రి సీతక్క అవగాహనారాహిత్యానికి నిదర్శనమన్నారు. కేసీఆర్ గారి దూరదృష్టి వల్లే ఈ ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఎకరాలకు పొలాలకు సాగునీరు అందుతోందని స్పష్టం చేశారు. మంత్రి సీతక్కకు గానీ, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి గానీ అసలు కాళేశ్వరం ప్రాజెక్టు గురించి, దాని సాంకేతికత గురించి కనీస అవగాహన లేదు. కాళేశ్వరం వల్ల తెలంగాణ రైతాంగానికి జరిగిన లబ్ధి ఏంటో తెలియకుండా, కేవలం రాజకీయ కక్ష సాధింపు కోసమే వారు అడ్డగోలు విమర్శలు చేస్తున్నారు." అని లక్ష్మణ్ బాబు మండిపడ్డారు.కేటీఆర్ పర్యటనను పోలీసులు అక్రమంగా అడ్డుకోవడం దుర్మార్గం నిన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి వర్యులు లి కేటీఆర్ ని పోలీసులు అక్రమంగా అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనానికి, నిరంకుశత్వానికి పరాకాష్ట అని లక్ష్మణ్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా క్షేత్రంలో నిలదీస్తారనే భయంతోనే ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకొని అక్రమ అరెస్టులకు, అడ్డగింపులకు పాల్పడుతోందని, ఇలాంటి బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడబోదని స్పష్టం చేశారు.ములుగు జిల్లాలో నిబంధనలు ఉల్లంఘించి నడుస్తున్న ఇసుక క్వారీల లారీల మితిమీరిన వేగం వల్ల నిండు ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నటికి మొన్న రాత్రి పూట ఏటూరు నాగారం చిన్నబోయినపల్లి గ్రామంలో రోడ్డు క్రాస్ చేస్తుండగా లారీ ఢీకొని తెలంగాణ ఉద్యమకారుడు రామకృష్ణ బలైపోయారని గుర్తుచేశారు.గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సాయంత్రం 5 గంటలకే క్వారీ పనులు బంద్ చేసి, 6 గంటల కల్లా చివరి లారీ బయటకు వెళ్లిపోవాలనే కచ్చితమైన రూల్ ఉండేదని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కారని మండిపడ్డారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి..... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్


### ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు

ఖమ్మం, జూలై 06 నిర్భయవార్త రిపోర్టర్.ప్రజావాణిలో ప్రజలు సమర్పించే దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిశీలించి, పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును సానుకూల దృక్పథంతో పరిశీలించి, అర్హత ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఖమ్మం అర్బన్ మండలం 15వ డివిజన్‌కు చెందిన సయ్యద్ రహమత్ బీ తాను అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నానని, సొంత ఇంటి స్థలం కూడా లేదని, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ కు పంపిస్తూ, నిబంధనల మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.తిరుమలాయపాలెం మండలానికి చెందిన భానురేఖ టేకులపల్లి మహిళా ప్రాంగణంలో ఏఎన్ఎం కోర్సు పూర్తి చేసినప్పటికీ, ఏఎన్ఎం సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ విషయంలో అధికారులు స్పందించడం లేదని దరఖాస్తు సమర్పించగా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి విచారించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.నేలకొండపల్లి మండలం రెవెన్యూ గ్రామానికి చెందిన లక్కం వెంకన్న, బక్కయ్య, శ్రీనివాస్ లు సర్వే నంబర్లు 993లో 23 గుంటలు, 616లో 15 గుంటలు, 1004లో 12 గుంటలు, 1005లో 12 గుంటల భూమి ఉందని, సాధా బైనామా కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ పాస్ పుస్తకాలు అందలేదని తెలపగా, సంబంధిత తహసీల్దార్‌కు పంపిస్తూ విచారించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామానికి చెందిన వంగర రమాదేవి తన కుమార్తెకు కళ్యాణలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు కాలేదని తెలపగా సంబంధిత తహసీల్దార్‌కు పంపిస్తూ అర్హత మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.




# ములుగు జిల్లా కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రివర్యులు శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క

ములుగు జూలై 06, (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)ములుగు జిల్లా కేంద్రంలో సోమవారం కలెక్టరేట్లో మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ బోర్డడే హేమంత్ సహదేవరావుతో కలిసి మేడారం ఆలయ అభివృద్ధి పారిశుద్ధ నిర్వహణ పనుల పురోగతి రామచంద్రాపురం భూ




సర్వే పైలాన్ నిర్మాణం వర్షాకాల పరిస్థితి రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారుమేడారం ఆలయ అభివృద్ధి అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రస్తుత వర్షాకాల సీజన్లో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లాలో కొనసాగుతున్న పెండింగ్ అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దానసరి సీతక్క సంబంధిత అధికారులకు ఆదేశించారు .ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ములుగు జిల్లాలో పర్యటించే సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. జాతీయ రహదారి పక్కన ఘట్టమ్మ దేవాలయం సమీపంలో పంచాయతీరాజ్ రోడ్డు పనులకు భూమి పూజ నూతన కలెక్టరేట్ ,మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, కేంద్రీయ విద్యాలయం పోట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ,కరకట్టల నిర్మాణం తదితర కీలక అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లాలో చేపట్టిన ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలను ఒకే శిలాఫలకంపై పొందుపరిచి రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించేలా కార్యచరణ రూపొందించాలని సూచించారు. మేడారం సమ్మక్క – సారలమ్మ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి పేర్కొన్నారు .ఆలయ పరిసరాల్లో భూసేకరణ, రహదారుల విస్తరణ, క్యూలైన్ల పునర్వ్యవస్థీకరణ, అతిథి గృహం, ఆసుపత్రి ,కాటేజీలు, పార్కింగ్, పారిశుద్ధ సదుపాయాలు జంపన్న వాగు పరిసర అభివృద్ధి తదితర అంశాలతో సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు.




యుద్ధ ప్రతిపాదికన జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. రామచంద్రాపురం పరిధిలోని 10,600 ఎకరాల భూమిని రిసర్వేను త్వరగా పూర్తిచేయాలని పోట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ రామప్ప, లక్కవరం పైపులైన్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు యూరియా కొరత లేకుండా తగిన నిలువలు సరిపడా ఉండాలని అధికారులు ఆదేశించారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి..




భద్రాచలం జూలై 6. నిర్భయ వార్త ప్రతినిధిరాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని, ఇందులో భాగంగా డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, సంబంధిత అధికారులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ జూన్ 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభించామని, ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు. పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లు పూర్తి చేసి తిరిగి అందించిన వెంటనే సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) యాప్‌లో డిజిటైజేషన్ చేపట్టాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాల్లో వివరాల నమోదుకు వాలంటీర్ల సేవలను వినియోగించుకుని ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ చేపట్టి, ప్రతి పోలింగ్ కేంద్రంలో నిర్దేశిత పరిమితికి మించి ఓటర్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో తప్పుడు సమాచారం సమర్పించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అవయవాలు కోల్పోయినా.. ఆశలు సజీవంగా...

ఫుట్‌బాల్ అభిమానులు ఎంతో ఆసక్తిగా వీక్షిస్తున్న ఫిఫా వరల్డ్ కప్‌ను శిథిలాల మధ్య జీవిస్తున్న గాజా పౌరులు కూడా చూస్తున్నారు. వాళ్లకు అందరిలా ఇళ్లు లేవు. క్రీడా ప్రాంగణాలు లేవు. కనీసం ఫోన్లలో సిగ్నళ్లు కూడా లేవు. అయినా వారికి దొరికిన అతి చిన్న వెసులుబాటులోనే ఫిఫా కప్‌ను వీక్షిస్తున్నారు. అక్కడే ఓ చోట కొంతమంది అమ్మాయిలు ఇవేమీ పట్టించుకోకుండా చాలా శ్రద్ధగా, తీక్షణంగా ఫుట్‌బాల్ ఆడుతున్నారు. వాళ్ల కళ్లల్లో ఏదో సాధించాలన్న పట్టుదల స్పష్టంగా కనిపిస్తోంది. 'గాజా ఎంప్యూటీ ఫుట్‌బాలర్స్' అని పిలవబడే ఈ తొలి మహిళా ఫుట్‌బాల్ బృందంలోని సభ్యులంతా వైకల్య బాధితులే. పుట్టుకతో వచ్చిన వైకల్యమో, దాడుల వల్ల అవయవాలు కోల్పోవడమో వారిని ఇక్కడికి చేర్చింది. ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌ను వీక్షిస్తున్న కోట్లాది మందిలో వీరూ ఉన్నారు. అయితే అందరిలాంటి వాళ్లు కాదు ఈ మహిళలు. ఏదో ఒక రోజు ప్రపంచ వేదికపై తమ ఆటతో గాజా ప్రజల ఆత్మవిశ్వాసాన్ని, పట్టుదలను చాటాలన్న కోరిక వారిలో బలంగా ఉంది.





పాలస్తీనాలో మిగిలివున్న ఒకే ఒక్క క్రీడా మైదానం దైర్ అల్ బలాహ్. అక్కడే ఈ ఎంప్యూటీలు (అవయవాలు కోల్పోయిన వారు) ప్రతి వారం శిక్షణ తీసుకుంటున్నారు. గాజాలో ఫుట్‌బాల్ ఆటకు దశాబ్దాల చరిత్ర ఉంది. 1930, 40 దశకాల్లోనే 'గాజా స్పోర్ట్స్ క్లబ్' (తరువాత పాలస్తీనా ఫుట్‌బాల్ ఫెడరేషన్) ఏర్పాటైంది. అందుకే ఒకవైపు భీకర దాడులు జరుగుతున్నప్పటికీ ప్రపంచ కప్‌ను వీక్షిస్తున్న అభిమానులు అక్కడ కనిపిస్తున్నారు. 'గాజాలో రోజురోజుకూ మారిపోతున్న పరిస్థితుల్లో ఇదొక్కటే మమ్మల్ని సాధారణంగా ఉంచుతుంది' అంటున్నారు వారంతా.

గాజా ఆరోగ్య శాఖ తాజా లెక్కల ప్రకారం ఇజ్రాయిల్ దాడుల్లో 6 వేల మంది అవయవాలను



కోల్పోయారు. వారందరికీ దీర్ఘకాలిక పునరావాసం, కృత్రిమ అవయవాల అవసరం చాలా ఉంది. ఈ పరిస్థితుల్లో 'పాలస్తీనా ఎంప్యూటీ ఫుట్‌బాల్ అసోసియేషన్'లో వచ్చిన మార్పులను ఆ సంస్థ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ ఫౌద్ అబూ ఇలా చెబుతున్నారు. 'ఈ గణాంకాలు మా పని విధానాన్ని పూర్తిగా మార్చేశాయి. దాడులకు ముందు నుంచే ఇక్కడ బాలికల బృందం ఉంది. దాడుల సమయంలో శిక్షణా శిబిరాన్ని పూర్తిగా మూసేశాం. అయితే ఇప్పుడు శిబిరానికి వస్తున్న వారి సంఖ్య బాగా పెరిగింది. కానీ వారందరికీ శిక్షణ ఇచ్చే సౌకర్యాలు ఇక్కడ లేవు. దాడులతో అంతా నాశనమైంది. అయినా ఈ అమ్మాయిల ధృడ సంకల్పాన్ని చూసి మేము ముందుకు వచ్చాం' అని ఆయన చెప్పారు. 2018లో స్థాపించబడిన ఈ సంఘం, అవయవాలు కోల్పోయిన వారికి శిక్షణ ఇవ్వడంతో పాటు పురుషులు, మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక జట్లను కూడా తయారుచేస్తోంది.

**2027 ప్రపంచకప్ లక్ష్యంగా..**

ప్రపంచ వేదికపై పాలస్తీనాకు ప్రాతినిధ్యం వహించాలని సిద్ధమవుతున్న ఈ మహిళా ఎంప్యూటీ ఫుట్‌బాల్ బృందం వైకల్యానికి లొంగిపోవడానికి నిరాకరిస్తోంది. దాడులతో తమ కలలను నాశనం చేయలేరని ప్రపంచానికి చూపించాలని తపిస్తోంది. 2027లో జరిగే మహిళల ఎంప్యూటీ ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో పాల్గొని గాజా స్ఫూర్తిని చాటాలని శక్తివంచన లేకుండా శ్రమిస్తోంది.

రోజాన్, కిఫా, ఐషా లాంటి మహిళలు ఎంతోమంది ఇప్పుడు దైర్ అల్ బలాహ్ మైదానంలో ఫుట్‌బాల్ శిక్షణ తీసుకుంటున్నారు. 2025 జూన్ 30న ఓ కేఫ్‌పై ఇజ్రాయిల్ చేసిన దాడిలో కిఫా తన స్నేహితులను కోల్పోయింది. స్పృహ కోల్పోయిన కిఫా 'అల్ షిఫా' ఆస్పత్రిలో కళ్లు తెరిచేసరికి తన కాలును తొలగించారు. గోల్‌కీపర్ ఐషా అల్ అబల్లాకు ఫుట్‌బాల్ అంటే విపరీతమైన ఇష్టం. ఎనిమిదేళ్లుగా ఆమె ఇక్కడ శిక్షణ తీసుకుంటోంది. 2008 యుద్ధ సమయంలో ఆమె తల్లి గర్భవతిగా ఉన్నప్పుడు వైట్ ఫాస్పరస్‌ను పీల్చడం వల్ల పుట్టుకతోనే ఐషా రెండు కాళ్లు, ఒక చేయి లేకుండా జన్మించింది. వైకల్యం తనను ఎప్పుడూ కుంగిపోనివ్వలేదని ఆమె చెబుతోంది. 'అదే నాకు ప్రేరణ' అంటోంది. దాడులకు ముందున్న పరిస్థితులను తలచుకుంటూ ఐషా బృందం శిక్షణ తీసుకుంటోంది. మళ్లీ మునుపటి పరిస్థితులు రావాలని వారి కళ్లు ఎదురుచూస్తున్నాయి. టీమ్ కెప్టెన్ లామియా ముస్లే మాట్లాడుతూ...

**దు:ఖం, నిరాశపై పోరాటం..**

'మా జట్టుకు ఒక ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉంది. పాలస్తీనా మహిళలు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనగలరని, క్లిష్ట పరిస్థితులను దాటుకుని రాగలరని ప్రపంచానికి నిరూపించాలనుకుంటున్నాం. మేము తన్నే ప్రతి బంతి వెనుక తీవ్ర దు:ఖం, బాధ, నిరాశపై చేసే పోరాటం కనిపిస్తుంది. అంతర్జాతీయ టోర్నమెంట్లలో మా పాలస్తీనా జెండా ఎగురవేయాలనేదే మా ముందున్న ఏకైక కల' అంటోంది.

రోజాన్ ఖైర్ కూడా ఈ బృందంలో సభ్యురాలే. 24 ఏళ్ల ఆమె ఒకప్పుడు పరుగుల రాణి. వివిధ పోటీల్లో పాల్గొని పతకాలు కూడా సాధించింది. అయితే ఇజ్రాయిల్ తన ఇంటిపై జరిపిన బాంబు దాడిలో రోజాన్ ఒక కాలు కోల్పోయింది. ఆ రోజు నుంచి ఆమె ప్రపంచమే మారిపోయింది. కాలు లేకపోయినా తన శక్తి సామర్థ్యాలను చూపించడానికి ఈ వేదికను ఉపయోగించుకుంటున్నానని చెబుతోంది.

బృందంలోని క్రీడాకారులంతా వారంలో ఒక రోజు దైర్ అల్ బలాహ్‌కు ప్రయాణిస్తున్నారు. గాజాలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఇది చాలా కష్టం. రవాణా మార్గాలు లేవు. క్రీడా సామగ్రి లేదు. మార్గమధ్యంలో దాడులతో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రయాణానికి డబ్బులు లేక, సుదూరంలో ఉన్న పునరావాస కేంద్రాల నుంచి రాలేక ఇప్పటికే కొంతమంది ఆగిపోయారు. మైదానానికి చేరుకున్నాక సరైన పోషకాహారం లేక తీవ్ర అలసటకు గురై, మరికొందరు ఆటపై పూర్తిగా దృష్టి పెట్టలేకపోతున్నారు.


అసాధ్యమనిపించే ఇలాంటి పరిస్థితుల్లో శిక్షణ పొందుతున్న వీళ్లను పట్టుదల మాత్రమే ముందుకు నడిపిస్తోంది. కోట్లాది మంది వీక్షకుల సమక్షంలో ప్రపంచ ఫుట్‌బాల్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. దైర్ అల్ బలాహ్‌లోని ఈ యువతులు మాత్రం ఏదో ఒక రోజు ప్రపంచం తమ ఆటను చూస్తుందన్న ఆశతో ఆ మ్యాచ్‌లను వీక్షిస్తున్నారు.

# రోజూ చూయింగ్ గమ్‌లను అదే పనిగా నములుతున్నారా.. అయితే జాగ్రత్త.. నిపుణుల హెచ్చరిక..

ముఖం సన్నగా కనిపించాలన్నా, దవడ ఆకృతి (జాలైన్) స్పష్టంగా రావాలన్నా చూయింగ్ గమ్‌ను ఎక్కువసేపు నమలడం ఉపయోగపడుతుందనే అభిప్రాయం యువతలో బలంగా ఉంది. దీంతో చాలామంది రోజూ గంటల తరబడి చూయింగ్ గమ్ నమలడం అలవాటుగా మార్చుకుంటున్నారు.

రోజూ చూయింగ్ గమ్‌లను అదే పనిగా నములుతున్నారా.. అయితే జాగ్రత్త.. నిపుణుల హెచ్చరిక..

జష్త్రవఙఱఅస్త్ర +బఎం। ముఖం సన్నగా కనిపించాలన్నా, దవడ ఆకృతి (జాలైన్) స్పష్టంగా రావాలన్నా చూయింగ్ గమ్‌ను ఎక్కువసేపు నమలడం ఉపయోగపడుతుందనే అభిప్రాయం యువతలో బలంగా ఉంది. దీంతో చాలామంది రోజూ గంటల తరబడి చూయింగ్ గమ్ నమలడం అలవాటుగా మార్చుకుంటున్నారు. అయితే ఇది ముఖాన్ని సన్నగా చేయకపోగా, దవడ కీళ్లపై అనవసర ఒత్తిడి పెంచి పలు ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దవడను పుర్రెతో కలిపే కీళ్లను టెంపరోమ్యాండిబ్యులర్ జాయింట్ (టీ జేఎం) అంటారు. చెవులకు ముందు భాగంలో ఉండే ఈ కీళ్లు నమలడం, మాట్లాడడం, నోరు తెరవడం–మూయడం వంటి ప్రతి కదలికలోనూ కీలక పాత్ర పోషిస్తాయి. అప్పుడప్పుడు చూయింగ్ గమ్ నమలడం వల్ల సాధారణంగా ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ గంటల తరబడి నిరంతరం నమలడం వల్ల ఈ కీళ్లపై పదేపదే ఒత్తిడి



పడుతుంది.

**దవడ కండరాలపై ఒత్తిడి..**


చూయింగ్ గమ్‌ను ఎక్కువసేపు నమలడం వల్ల దవడ కండరాలు అధికంగా పనిచేయాల్సి వస్తుంది. దీంతో క్రమంగా దవడ కీళ్లలో ఒత్తిడి పెరిగి కండరాలు అలసిపోవడం, కీళ్ల పనితీరు దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితిని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలిక దవడ సమస్యలు తలెత్తుతాయి. దవడ కీళ్లపై అధిక ఒత్తిడి పడటం వల్ల కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. నోరు తెరిచినప్పుడు లేదా మూసినప్పుడు దవడ వద్ద క్లిక్ అనే శబ్దం వినిపించడం, దవడ బిగుసుకుపోవడం, చెవుల పక్కన లేదా కణతల వద్ద తలనొప్పి రావడం, ఆహారం నమిలేటప్పుడు నొప్పి అనిపించడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

**ముఖంలోని కొవ్వు కరుగుతుందా..**

చూయింగ్ గమ్ ను నమలడం వల్ల ముఖంలోని కొవ్వు కరిగి ముఖం సన్నగా మారుతుందనే అభిప్రాయానికి శాస్త్రీయ ఆధారాలు లేవు. ఇది దవడ కండరాలను కొంతవరకు బలపరుస్తుంది. కానీ శరీరంలోని ఒకే భాగంలో కొవ్వును కరిగించడం సాధ్యం కాదు. కొవ్వు తగ్గడం మొత్తం శరీర బరువు తగ్గుదలతో సంబంధం ఉన్న ప్రక్రియ. కాబట్టి చూయింగ్ గమ్‌ను ముఖానికి వ్యాయామంగా భావించడం సరైనది కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. దవడ కీళ్లు కూడా శరీరంలోని ఇతర కీళ్ల మాదిరిగానే పరిమితంగా ఉపయోగించినప్పుడే ఆరోగ్యంగా ఉంటాయి. అవసరానికి మించి నిరంతరం ఒత్తిడి పెడితే సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందువల్ల అప్పుడప్పుడు చూయింగ్ గమ్ నమలడం సాధారణంగా హానికరం కాకపోయినా, అలవాటుగా గంటల తరబడి నమలడం మాత్రం మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు.

# ఉదయం నిద్రలేవగానే నీళ్లు ఎందుకు తాగాలి?

ఉదయం నిద్రలేవగానే చాలామందికి ముందుగా టీ లేదా కాఫీ తాగే అలవాటు ఉంటుంది. అయితే ఖాళీ కడుపుతో టీ లేదా కాఫీ తాగడం కంటే ఒక గ్లాసు నీరు తాగడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.




**శరీరానికి తక్షణ శక్తి అందుతుంది**

రాత్రంతా నీరు తాగకుండా ఉండటం వల్ల ఉదయం కొంత నీరసం లేదా అలసటగా అనిపించవచ్చు. నిద్రలేవగానే ఒక గ్లాసు నీరు తాగితే శరీరానికి తేమ అందడంతో పాటు ఉత్సాహంగా అనిపిస్తుంది.

**జీర్ణక్రియకు తోడ్పడుతుంది**

ఉదయం నీరు తాగడం వల్ల జీర్ణవ్యవస్థ చురుకుగా పనిచేయడం ప్రారంభిస్తుంది. దీంతో ఆహారం సులభంగా జీర్ణమయ్యే అవకాశం ఉంటుంది.

**బరువు నియంత్రణ**

ఖాళీ కడుపుతో నీరు తాగడం వల్ల కడుపు నిండిన భావన కలగవచ్చు. దీంతో ఆహారం తక్కువగా తీసుకునేందుకు అవకాశముంటుంది. అలాగే శరీర జీవక్రియకు కూడా కొంత మేలు చేస్తుంది. అయితే బరువు తగ్గాలంటే ఆహార నియంత్రణ, వ్యాయామం కూడా తప్పనిసరి.

**ఏకాగ్రత పెరగడానికి**

శరీరంలో తగినంత నీరు ఉంటే మెదడు పనితీరు మెరుగ్గా ఉంటుంది. దీంతో ఏకాగ్రత, చురుకుదనం పెరగడంలో సహాయపడుతుంది.

**చర్మ ఆరోగ్యానికి మంచిది**శరీరానికి సరిపడా నీరు అందితే చర్మం తేమను నిలుపుకుంటుంది. దీంతో చర్మం తాజాగా కనిపించడంలో సహాయపడుతుంది.

**తలనొప్పి తగ్గడంలో** కొన్నిసార్లు శరీరంలో నీటి కొరత వల్ల తలనొప్పి రావచ్చు. అలాంటి సందర్భాల్లో ఉదయం ఒక గ్లాసు నీరు తాగడం ఉపశమనాన్ని కలిగించవచ్చు. అయితే తరచూ తలనొప్పి వస్తే వైద్యులని సంప్రదించడం మంచిది.





# లెనిన్- బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే క్యూట్ స్పీచ్‌కి తిరుపతి షేక్



సితార ఎంటర్‌టైన్‌మెంట్స్- మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి సంయుక్తంగా అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో నిర్మించిన సరికొత్త యాక్షన్ డ్రామా చిత్రం -లెనిన్-.సితార ఎంటర్‌టైన్‌మెంట్స్- మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి సంయుక్తంగా అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో నిర్మించిన సరికొత్త యాక్షన్ డ్రామా చిత్రం -లెనిన్-. అఖిల్ అక్కినేని- భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన ఈ చిత్రానికి మురళి కిషోర్ అబ్బూరు (నందు) దర్శకత్వం వహించారు. జూలై 10న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి విడుదలవుతోంది. చిత్రబృందం ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో భారీ ఎత్తున ప్రీ-రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ వేడుకలో అక్కినేని నాగార్జున, అఖిల్ సినిమా విజయంపై పూర్తి నమ్మకం వ్యక్తం చేయగా, చిత్ర కథానాయిక భాగ్యశ్రీ బోర్సే క్యూట్ తెలుగు స్పీచ్ తిరుపతిని షేక్ చేసింది. --తిరుపతి... ట్రైలర్ నచ్చిందా?-- అంటూ భాగ్యశ్రీ ప్రశ్నించడం అభిమానులందరినీ విశేషంగా అలరించింది. భాగ్యశ్రీ బోర్సే స్టేజ్ పైకి రాగానే మైక్ అందుకుని ఎంతో ఎనర్జిటిక్‌గా --తిరుపతి.. ఎలా ఉన్నారు?-- అంటూ అక్కడ గుమికూడిన భారీ జనసందోహాన్ని పలకరించిన తీరు ఆకట్టుకుంది. ఆ తర్వాత సినిమా ట్రైలర్ గురించి స్పందిస్తూ.. --ట్రైలర్ నచ్చిందా? నచ్చిందా?-- అని అభిమానులను అడిగారు. దానికి ప్రేక్షకుల నుండి థియేటర్ ఊగిపోయేలా.. భారీ కేకలతో రెస్పాన్స్ రావడంతో.. ఎంతో మురిసిపోతూ --ఓ అయితే అదరగొట్టేసింది అన్నమాట-- అని భాగ్యశ్రీ అచ్చ తెలుగులో మాట్లాడుతూ అభిమానుల్లో జోష్ పెంచారు. స్టేజ్ పైన ఉన్న ఈ ఉత్తరాది భామను తెలుగు ప్రేక్షకులు తమ సొంత అమ్మాయిలా అంగీకరించి.. ఇంతటి ప్రేమాభిమానాలు చూపిస్తున్నందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ.. ఇంకా తెలుగు నేర్చుకుంటున్నానని నవ్వుతూ చెప్పడం అక్కడి వారిని ఆకట్టుకుంది. ఈ సినిమాలో తను పోషించిన పాత్ర గురించి భాగ్యశ్రీ ఎంతో భావోద్వేగంతో మాట్లాడారు. -లెనిన్- చిత్రంలో తను -భారతి- అనే అద్భుతమైన పాత్రను పోషించానని వెల్లడించారు. ఆ పేరు వినగానే ఒక విభిన్నమైన అనుభూతి.. ఒక ఎమోషన్... ఒక గొప్ప ప్రయాణం గుర్తొస్తాయని చెప్పారు. ఇలాంటి నటనకు ప్రాధాన్యమున్న గొప్ప పాత్రను తనకు ఇచ్చిన దర్శక- నిర్మాతలకు ప్రత్యేకంగా థాంక్స్ చెప్పారు.

## సెట్లో హీరోలకు ఉన్న గౌరవం హీరోయిన్‌లకు ఉండదు.. కృతి సనన్ ఆరోపణ!

సినీ పరిశ్రమలో గ్లామర్ వెలుగులతో పాటు అసమానతలు, అణచివేతకు సంబంధించిన కొన్ని చీకటి కోణాలు కూడా దాగి ఉన్నాయి.సినీ పరిశ్రమలో గ్లామర్ వెలుగులతో పాటు అసమానతలు, అణచివేతకు సంబంధించిన కొన్ని చీకటి కోణాలు కూడా దాగి ఉన్నాయి. ఇండస్ట్రీలో దశాబ్ద కాలానికి పైగా ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న యంగ్ హీరోయిన్ కృతి సనన్ ఇటీవల ఇంటర్వ్యూలో పురుషాధిక్య ప్రపంచంపై సూటిగా విరుచుకుపడ్డారు. ముఖ్యంగా సినిమా ప్రమోషన్స్ సమయంలో ఒక మేల్ స్టార్ తనను కావాలనే పక్కకు తోసేయడానికి ప్రయత్నించాడని.. తాను ఏ ప్రమోషనల్ ఈవెంట్‌లో పాల్గొనాలో ఆయనే నిర్ణయించడానికి ప్రయత్నించాడని కృతి వ్యాఖ్యానించారు. ఇది తనకు తీవ్ర అవమానంగా అనిపించిందని.. ఒకవేళ ప్రమోషన్స్‌లో నా అవసరం లేదనుకుంటే ఆ హీరోనే ఒంటరిగా ప్రమోట్ చేసుకోవాలంటూ తాను వెనక్కి తగ్గానని కృతి సనన్ బోల్డ్‌గా చెప్పుకొచ్చారు. కృతి సనన్ తన కెరీర్ ప్రారంభంలో (2014) ఎదుర్కొన్న వివక్షను గుర్తు చేసుకుంటూ.. సినిమా సెట్స్‌పై ఒక పురుషుడికి ఇచ్చే గౌరవానికి.. ఒక మహిళకు ఇచ్చే ప్రాధాన్యతకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. షూటింగ్ సమయంలో మేల్ యాక్టర్స్‌కు పెద్ద రూమ్‌లు, లగ్జరీ కార్లు



ఇస్తూ.. మహిళా నటీమణులకు మాత్రం చిన్న రూమ్‌లు, చిన్న కార్లను కేటాయించేవారని తెలిపారు. వాహనాలు, గదుల సైజుల గురించి తనకు పట్టింపు లేకపోయినా... అవి తమను తక్కువ చేసి చూపేలా ఉంటాయని కృతి అభ్యంతరం వ్యక్తం చేశారు. సీనియర్ స్టార్ల విషయంలో అది సమంజసమే అయినా... అంతగా అనుభవం లేని హీరోల విషయంలో కూడా అసిస్టెంట్ డైరెక్టర్లు హీరో టైమింగ్స్‌కు భయపడి, హీరోయిన్లను ముందే పిలిచి సెట్స్‌పై వేచి చూసేలా చేస్తారని కృతి మండిపడ్డారు. సెట్స్‌పై ఒక మహిళ తన గళాన్ని వినిపిస్తే ఇండస్ట్రీ ఎలా రియాక్ట్ అవుతుందో కూడా కృతి వివరించారు. తాను నటనలో ఎలాంటి శిక్షణ తీసుకోకపోవడం వల్ల డైరెక్టర్లను ఏవైనా ప్రశ్నలు అడిగితే లేదా సలహాలు ఇస్తే.. --నువ్వు ఎక్కువగా అనలైజ్ చేస్తున్నావ్-- అంటూ కొట్టిపారేసేవారని చెప్పారు. అదే సలహాను ఒక మేల్ నటుడు ఇస్తే మాత్రం --అవును, అలాగే చేద్దాం-- అంటూ చాలా గొప్పగా స్వీకరిస్తారని.. మగాళ్లు ప్రశ్నిస్తే అది వారి -ఇన్వాల్వ్‌మెంట్- అని, మహిళలు ప్రశ్నిస్తే మాత్రం -అతి-గా చూస్తారని కృతి విమర్శించారు. ఒక వర్కింగ్ ఎన్విరాన్‌మెంట్‌లో సమాన గౌరవం లభించనప్పుడు.. జెండర్ వివక్షకు వ్యతిరేకంగా తను గొంతు ఎత్తకపోతే ఆ బాధ తనను రోజురోజుకూ పీడిస్తుందని.. అందుకే తాను ఎదురుతిరగడం నేర్చుకున్నానని కృతి స్పష్టం చేశారు.

## 'సింగ్ గీతం' స్ట్రీమింగ్ డేట్ ప్రకటించిన నెట్ ఫ్లిక్స్ !




దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు 'సింగ్ గీతం' అనే ఆసక్తికరమైన చిత్రానికి దర్శకత్వం వహించారు. దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ చిత్రానికి మద్దతుగా నిలుస్తూ వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై స్వయంగా నిర్మించాడు. 2026 జూన్ 12న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తనదైన వినూత్న కథన శైలితో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇందులో ప్రధాన పాత్రలు పోషించిన అహల్య, అయాన్ మరియు షాలిని కొండేపూడి తమ సహజమైన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.కాగా ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీలో విడుదలకు సిద్ధమైంది. నెట్ ఫ్లిక్స్ తన 'కమింగ్ సూన్' (త్వరలో రాబోయే తన చిత్రాల లిస్ట్ లో) విభాగంలో ఈ చిత్రాన్ని చేర్చింది. 2026 జూలై 9న ఈ సినిమా స్ట్రీమింగ్ కానుందని ధృవీకరించింది. పైగా వివిధ ప్రాంతాల ప్రేక్షకులకు అందుబాటులో ఉండేలా ఈ చిత్రం పలు భాషల్లో విడుదలయ్యే అవకాశం ఉంది. ఎక్కువ మంది కొత్త నటీనటులతో, లిమిటెడ్ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు.

## కర్ణ సినిమాలో సల్మాన్ ఖాన్.. ఖాయమేనా ?

తమిళ స్టార్ హీరో సూర్య, 'రంగ్ దే బసంతి' దర్శకుడు రాకేష్ ఓంప్రకాష్ మెహ్రా 'కర్ణ' అనే పౌరాణిక చిత్రం కోసం జతకట్టారు. కానీ, బడ్జెట్ పరిమితుల కారణంగా ప్రీ-ప్రొడక్షన్ దశలోనే ఆ సినిమా ఆగిపోయింది. ఐతే, ఈ పీరియడ్ డ్రామా కోసం సల్మాన్ ఖాన్, రాకేష్ ఓంప్రకాష్ మెహ్రాతో చేతులు కలపనున్నారని బాలీవుడ్ మీడియాలో రీసెంట్ గా



వార్తలు వచ్చాయి. తాజాగా బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తున్న తాజా అప్ డేట్ ప్రకారం, రాకేష్ ఓంప్రకాష్ మెహ్రా తన 'కర్ణ' చిత్రాన్ని సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో ఈ సినిమా తీస్తున్నారట.సల్మాన్ ఖాన్ ఈ సినిమాలో యాక్ట్ చేసున్నాడని.. ఈ విషయం పై తుది నిర్ణయం కూడా తీసుకున్నాడని తెలుస్తోంది. అభిమానులు కూడా సల్మాన్ ఖాన్ ఈ సినిమాలో నటిస్తే బాగుంటుందని పోస్ట్ లు పెడుతున్నారు. మొత్తానికి సల్మాన్ ఖాన్ ఈ ప్రాజెక్ట్‌లో భాగమైతే, భారతీయ సినిమాలోని ప్రస్తుత అతిపెద్ద స్టార్లలో మరొకరు మహాభారతంలోని పాత్రను పోషించినట్లు అవుతుంది. కల్కిలో ప్రభాస్ కర్ణ పాత్రలో కనిపించి ఆకట్టుకున్నాడు. మరి ఇప్పుడు సల్మాన్ కూడా కర్ణ పాత్రలో ఏ రేంజ్ లో ఆకట్టుకుంటాడో చూడాలి.


## తారక్ లైనప్.. ఆ కాంబో సంగతేంటి?



ఒక సినిమా సెట్స్ పై ఉండగానే మరో రెండు, మూడు ప్రాజెక్టులు లైనప్ లో కనిపిస్తే అభిమానుల్లో ఆసక్తి పెరుగుతుంది. ఒక సినిమా సెట్స్ పై ఉండగానే మరో రెండు, మూడు ప్రాజెక్టులు లైనప్ లో కనిపిస్తే అభిమానుల్లో ఆసక్తి పెరుగుతుంది. ఇప్పుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్ విషయంలోనూ అదే జరుగుతోంది. ఇప్పటికే భారీ సినిమాలతో బిజీగా ఉన్న తారక్ లైనప్ లో దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ ప్రాజెక్ట్ కూడా ఉందనే విషయంలో తాజాగా మరింత క్లారిటీ వచ్చింది. అయితే ఆ సినిమా ఎప్పుడు మొదలవుతుందన్నదే ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. యంగ్ ప్రొడ్యూసర్ నాగవంశీ నిర్మించిన లెనిన్ జూలై 10న విడుదల కానుంది. ఆ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తన అప్ కమింగ్ ప్రాజెక్టుల గురించి ఆసక్తికర విషయాలను ఆయన పంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఎన్టీఆర్, నెల్సన్ కాంబోలో చాలా కాలంగా ప్రచారంలో ఉన్న సినిమాపైనా స్పందించారు. నెల్సన్ తనకు అత్యంత ఇష్టమైన దర్శకుల్లో ఒకరని చెప్పిన నాగవంశీ.. ఆయనతో సినిమా చేసేందుకు ఇప్పటికే ఒప్పందం కుదిరినట్లు వెల్లడించారు. అంతేకాదు ప్రాజెక్టులో హీరోగా దాదాపు ఎన్టీఆరే ఉంటారని స్పష్టం చేశారు. మొదటి నుంచి నెల్సన్ కూడా తారక్ తో సినిమా చేయాలనే ఆసక్తితో ఉన్నట్లు తెలిపారు. దీంతో క్రేజీ కాంబోపై వస్తున్న వార్తలకు మరింత బలం చేకూరినట్లయింది. అయితే ఇక్కడే అసలు సమస్య ఉంది. ప్రస్తుతం ఎన్టీఆర్, నెల్సన్ ఇద్దరూ భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. తారక్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న డ్రాగన్ పై ఫోకస్ పెట్టారు. భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపొందుతున్న ఆ సినిమాపై ఇప్పటికే అంచనాలు ఉన్నాయి. ఆ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత తారక్.. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో మూవీ చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు దేవర 2 కూడా ఆయన లైనప్‌లో ఉంది. నెల్సన్ పరిస్థితి కూడా దాదాపు ఇలాగే ఉంది. ప్రస్తుతం ఆయన రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న జైలర్ 2 పనుల్లో బిజీగా ఉన్నారు. ఆ సినిమా పూర్తయిన తర్వాతే తదుపరి ప్రాజెక్టుపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టే అవకాశం ఉంది.దీంతో ఎన్టీఆర్, నెల్సన్ కాంబినేషన్ లో సినిమా ఖాయమైనా.. సెట్స్ పైకి వెళ్లేందుకు మాత్రం టైమ్ పట్టేలా కనిపిస్తోంది. మధ్యలో ఆ ప్రాజెక్టులో ఎన్టీఆర్ స్థానంలో మరో స్టార్ హీరో నటించే అవకాశం ఉందంటూ కూడా వార్తలు వచ్చాయి. ముఖ్యంగా తారక్ వరుస సినిమాలతో బిజీగా ఉండటంతో హీరో మారే అవకాశం ఉందనే ప్రచారం జరిగింది. అయితే నాగవంశీ తాజా వ్యాఖ్యలతో ఆ రూమర్లకు దాదాపుగా చెక్ పడినట్లయింది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే ఎన్టీఆర్- నెల్సన్ సినిమా ఇప్పటికిప్పుడు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపించడం లేదు. కానీ ప్రాజెక్ట్ మాత్రం లైనప్ లో ఉన్నట్లేనని నాగవంశీ కామెంట్స్ తో క్లారిటీ వచ్చింది. ఇద్దరి కమిట్మెంట్లు పూర్తయి, డేట్స్ కుదిరితే ఆ క్రేజీ కాంబినేషన్ పట్టాలెక్కే అవకాశం ఉంది. మరి తారక్ భారీ లైనప్ లో నెల్సన్ సినిమాకు ఎప్పుడు ఛాన్స్ వస్తుందో చూడాలి.

## సీనియర్ స్టార్ అదృశ్యం ఇప్పటికీ మిస్టరీగానే!

రాజ్ కిరణ్ కెరీర్ ఒక్కసారిగా కుంటుపడటం వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఒడిదుడుకులు ఆయన్ని తీవ్ర మానసిక ఆందోళనకు గురి చేశాయని అప్పట్లో వార్తలొచ్చాయి. ఎనభైల దశకంలో బాలీవుడ్ వెండితెరపై తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న నటుడు రాజ్ కిరణ్. -అర్థ్-, -కర్జ్- వంటి క్లాసిక్ చిత్రాలలో రాజ్ కిరణ్ నటన ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. హాస్య ప్రధాన పాత్రలైనా? గంభీరమైన పాత్రలైనా? తనదైన శైలిలో మెప్పించగల నటుడిగా రాజ్ కిరణ్ కు మంచి పేరుండేది. అయితే అకస్మాత్తుగా ఆయన చిత్ర పరిశ్రమకు దూరం కావడమే కాకుండా అజ్ఞాతంలోకి వెళ్ళిపోవడం వెనుక ఉన్న మిస్టరీ దశాబ్దాలు గడిచినా ఇంకా వీడలేదు.రాజ్ కిరణ్ కెరీర్ ఒక్కసారిగా కుంటుపడటం వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఒడిదుడుకులు ఆయన్ని తీవ్ర మానసిక ఆందోళనకు గురి చేశాయని అప్పట్లో వార్తలొచ్చాయి. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు రాజ్ ను సమాజానికి, సినీ రంగానికి దూరం చేశాయని పలువురు సహచర నటులు గతంలో అభిప్రాయపడ్డారు. ఒకానొక దశలో ఆయన అమెరికాలోని మానసిక వైద్యశాలలో చికిత్స పొందుతున్నారని వార్తలు వచ్చినా? వాటిలో వాస్తవమెంత అన్నది నేటికీ క్లారిటీ లేదు. రాజ్ కిరణ్ అదృశ్యం వెనుక ఉన్న సత్యం ఏమిటనేది సినీ వర్గాల్లో ఇప్పటికీ చర్చనీయాంశమే. కొందరు ఆయన ఇక లేరని భావిస్తే.. మరికొందరు ఎక్కడో ఒకచోట ఒంటరిగా జీవిస్తున్నారని నమ్ముతున్నారు. రాజ్ కిరణ్ తో నటించిన సహనటులు ఆయన్ని వెతికేందుకు చేసిన ప్రయత్నాలు కూడా పెద్దగా ఫలితాన్ని ఇవ్వలేదు. ఒక సెలబ్రిటీ అంత సులభంగా ప్రపంచ దృష్టి నుండి మరుగున పడిపోవడం అనేది అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించింది. ఇలాంటి ఉదంతాలు సెలబ్రిటీల జీవితంలోని చీకటి కోణాలను బయటపెడతాయి. తెరపై నవ్వుతూ కనిపించే కళాకారుడు తెర వెనుక ఎంతటి వేదనను అనుభవించాడో? ఎవరూ ఊహించలేరు.




రాజ్ కిరణ్ కేసు కేవలం ఒక వ్యక్తి అదృశ్యం మాత్రమే కాదు. అది స్టార్‌డమ్ , పతనం మధ్య ఉండే క్రూరమైన వాస్తవానికి నిదర్శనం. వ్యక్తిగత జీవితాన్ని కాపాడుకోవడంలో విఫలమైతే? ఎంతటి గొప్ప నటుడైనా కాలగర్భంలో కలిసిపోతారనేందుకు ఇదొక ఉదాహరణ. ఎవరికీ తెలియకపోవడం విషాదకరమైన మలుపు. ఆయన మళ్ళీ కనిపిస్తారని, తన మౌనానికి తెర దించుతారని అభిమానులు ఆశపడటం సహజమే. కానీ దశాబ్దాలుగా అందుతున్న సమాచారం ప్రకారం ఆయన జాడ కనుగొనడం దాదాపు అసాధ్యంగా మారింది. ఆ మౌనం వెనుక ఏ కథ దాగి ఉందో? ఆ మిస్టరీని ఛేదించే వారు ఎవ్వరూ లేకపోవడం బాధాకరం. చివరిగా రాజ్ కిరణ్ అదృశ్యం సినీ ప్రపంచానికి తీరని లోటు. ఆయన అందించిన అద్భుతమైన పాత్రలు ఇప్పటికీ మనకు గుర్తు చేస్తూనే ఉన్నాయి. అయితే ఒక కళాకారుడి వ్యక్తిగత జీవితం చివరకు ఇలాంటి అనిశ్చితికి లోను కావడం సమాజం , పరిశ్రమ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన విషయం.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197